# ప్రజా తపన

prajathapana.com

*News that matters*




**భోగవాంఛలను జయించిన బుద్ధికి అపరిమితమైన శక్తి అజేయమైన సంకల్పబలం సిద్ధిస్తాయి.ంది.**

**- స్వామి వివేకానంద**


సంపుటి :01 సంచిక: 15 బుధవారం 22 ఫిబ్రవరి 2023 మిరియాల. మంజునాథ ఆధ్వర్యంలో పేజీలు :08 ధర :05/-


## రాష్ట్ర ప్రభుత్వానికి సహకారం, వాత్సల్యం అందించారు



**సీఎంజగన్ మోహన్ రెడ్డి**

**గవర్నర్ భిశ్వభూషణ్ కు ఆత్మీయ వీడ్కోలు**

**విజయవాడ**

ఎ కన్వెన్షన్ సెంటర్లో గవర్నర్ బిశ్వభూషణ్ హరిచందన్కు ఏపీ ప్రభుత్వం ఆత్మీయ వీడ్కోలు సమావేశం నిర్వహించింది. గవర్నర్ ఆత్మీయ వీడ్కోలు సమావేశానికి సీఎం వైయస్.జగన్ ముఖ్య అతిధిగా హాజరయ్యారు.

సీఎం మాట్లాడుతూ బిశ్వభూషన్ హరిచందన్ కు కి ఆంధ్రప్రదేశ్ ప్రజల తరపున, ప్రభుత్వం తరపున, నా తరపున అభినందనలుతో పాటు ధన్యవాదాలు కూడా తెలుపుతున్నాను. చత్తీస్ఘడ్ గవర్నర్గా వెళ్తున్నందుకు అభినందనలు. ధ్రప్రదేశ్లో ఒక ఆత్మీయుడైన పెద్దమనిషిగా, గవర్నర్ వ్యవస్థకు ఒక నిండుతనం తీసుకువచ్చినందుకు ధన్యవాదాలని అన్నారు.

హరిచందన్ రు గవర్నర్గా ఉన్న ఈ మూడు సంవత్సరాల కాలంలో రాజ్యాంగ వ్యవస్థల మధ్య ఉండాల్సిన సమన్వయం అన్నది ఎలా ఉండాలో ఆచరణలో గొప్పగా చూపించారు. గవర్నర్లకు రాష్ట్ర

(మిగతా 2లో)

## దేశం ఏదైనా కష్టాల్లో ఉంటే మానవత్వంతో సాయం చేయడమే భారత విధానం

**ప్రధానమంత్రి నరేంద్ర మోదీ**

**న్యూఢిల్లీ :**

ప్రపంచమంతా ఒకటే కుటుంబమని, ఎవరికి ఏ సమస్య వచ్చినా తక్షణమే స్పందించాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ పిలుపునిచ్చారు. ఇతరులకు సాయం చేసేవారు నిస్వార్థులని, ఇది వ్యక్తులకే కాకుండా దేశాలకు కూడా వర్తిస్తుందని చెప్పారు. అనేక సంవత్సరాలుగా భారత్ నిస్వార్థంగా సాయం చేస్తూ మంచి పేరు తెచ్చుకుందని చెప్పారు. దేశం ఏదైనా కష్టాల్లో ఉంటే మానవత్వంతో సాయం చేయడమే భారత విధానమన్నారు. తుర్కియేసిరియాల్లో భూకంప బాధితులకు సేవలు అందించి వచ్చిన భారత సహాయక బృందాలతో ప్రధాని ఢిల్లీలోని తన నివాసంలో సమావేశమయ్యారు. రెండు దేశాల్లో వారు 10 రోజుల పాటు అందించిన సేవలను ప్రధాని కొనియాడారు. గతంలో ఆఫ్ఘనిస్థాన్, ఉక్రెయిన్, నేపాల్, శ్రీలంక, మాల్దీవుల్లోనూ భారత సహాయక బృందాలు విశేష సేవలందించాయని మోదీ కీర్తించారు. డాగ్ స్క్వాడ్ సామర్థ్యం పెరిగిందని మోదీ చెప్పారు. గుజరాత్ భూకంపవేళ 2001లో తాను



వాలంటీర్గా సేవలందించానని, ఆ సమయంలో సేవలు ఎంత కష్టమో తనకు తెలుసన్నారు. విపత్కర పరిస్థితులు ఎదుర్కొంటున్న దేశాల్లో భారత జెండాతో సహాయక బృందాలు రాగానే బాధిత దేశాల ప్రజల్లో భరోసా పెరుగుతోందని, ఎన్డీఆర్ఎఫ్ కీర్తి నలుదిశలా వ్యాపిస్తోందని ప్రధాని ప్రశంసించారు. తుర్కియేసిరియాల్లో సేవలు ముగించుకుని భారత బృందాలన్నీ నిన్ననే న్యూఢిల్లీ చేరుకున్నాయి. నిన్న భారత బృందాలు స్వదేశానికి వస్తుండగా తుర్కియే సిరియాల్లో చాలా చోట్లా ప్రజలు చప్పట్లతో స్వాగతించారు. వరుసగా నిల్చుని చప్పట్లతో తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. కొందరైతే భారత సహాయక

(మిగతా 2లో)




## శివసేన వివాదం

**ముంబై :**

ఎన్నికల సంఘం నిర్ణయంపై స్టే విధించాలని ఉద్ధవ్ ఠాక్రే తరఫు న్యాయవాది కపిల్ సిబల్ కోరగా సుప్రీంకోర్టు అందుకు తిరస్కరించింది. శివసేన విషయంలో ఎన్నికల సంఘం తప్పుడు నిర్ణయం తీసుకుందని, ఈసీ ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. దీనిపై చీఫ్ జస్టిస్ స్పందిస్తూ.. ఈ కేసును రాజ్యాంగ ధర్మాసనం విచారణ చేస్తుందని చెప్పారు. ప్రతిరోజూ చేసే రోజువారీ పనులపై ప్రభావం చూపకూడదని తాము కోరుకుంటున్నామని, కాబట్టి మంగళవారం మధ్యాహ్నం 3.30 గంటలకు విచారణ జరుపుతామని ఆయన చెప్పారు. ఉద్ధవ్ వర్సెస్ షిండే వివాదానికి సంబంధించిన ఇతర అంశాలను సుప్రీంకోర్టు రాజ్యాంగ ధర్మాసనం ఇప్పటికే లోతుగా విచారణ చేస్తోందని, అందువల్ల మధ్యలో అడ్డుకోవడం సరికాదని అన్నారు.

## మైనారిటీలకు న్యాయం చేస్తాం

**తిరుపతి**

శ్రీకాళహస్తిలో మైనారిటీలతో నారా లోకేష్ సమావేశం అయ్యారు. సమావేశంలో నారా లోకేష్ మాట్లాడుతూ మైనారిటీల్లో పేదరికం ఎక్కువగా ఉంది. ఇది ఎన్టీఆర్ ఆనాడే గుర్తించి మైనారిటీ కార్పొరేషన్ ఏర్పాటు చేశారు. ఎన్ని ప్రభుత్వాలు మారినా మైనారిటీ కార్పొరేషన్ కొనసాగింది.. కానీ జగన్ రెడ్డి వచ్చాక తీసేశారు. తిరుపతి పార్లమెంట్ లో మహిళలకు రెసిరెన్షియల్ కాలేజీ ఏర్పాటు చేస్తాం. పాదయాత్రలో జగన్ ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు..అమలు చేయలేదు. కానీ మేము ఇస్లామిక్ బ్యాంక్ ఏర్పాటు చేస్తాం..మేనిఫెస్టోలో పెడతామని అన్నారు.

ముస్లింలకు పని చేసి పెట్టింది టీడీపీ..ఉత్తుత్తి హామీలు ఇచ్చింది వైసీపీ. హజ్ యాత్రకు సహాయం చేసాం. ఇమామ్ లకు రూ.5 వేలు, మౌజామ్ లకు రూ.3వేలు ఇచ్చాం. రంజాన్ పండుగకు తోఫా కూడా ఇచ్చాం. కానీ ఇచ్చిన హామీలు నిలబెట్టుకోకుండా చంద్రబాబు పెట్టిన పథకాలు ఈ సీఎం తొలగించారు. పప్పుబెల్లాలు ఇచ్చే చేతులు దులుపుకునే వాళ్లం కాదు. ఎందుకు బానిసలుగా ఉండాలి.? ఎందుకు మీరు ఉద్యోగాలు ఇచ్చే స్థాయికి వెళ్లకూడదు.? పార్టీ ఆలోచన ఒక్కటే..మైనారిటీ సోదరులకు



ఏపీఐఐసీ ఇండస్ట్రీయల్ క్లస్టర్ లో స్థానం కల్పించి, మీరే ఉద్యోగాలు కల్పించేలా విధానాలు రూపొందిస్తామని అన్నారు.

ఈ ప్రభుత్వం వచ్చాక ముస్లింలపై దాడులు పెరిగాయి. ముస్లింలు భయంతో బతుకుతున్నారు. రోజుకో భూమిని కబ్జా చేస్తుంటే భూములు ఎక్కడ మిగులుతాయి.? మైనారిటీలకు ఇచ్చిన భూములు లాక్కుంటే ఎలా.? బియ్యపు మధుసూదన్ రెడ్డి బడా చోర్. ముస్లింల సంక్షేమ కార్యక్రమాలు కుదించింది జగనే. మా కంటే ముందున్న ప్రభుత్వాలు తీసుకొచ్చిన సంక్షేమ పథకాలు మేము తొలగించలేదు. ఇంకా అదనంగా అందించాం. మసీదు మరమ్మతులకు కూడా నిధులు కేటాయించాం. షాదీ ఖానాలు కూడా నిర్మించాం. ముస్లింలకు ఎవరు ఏం చేశారో..చర్చించేందుకు సిద్ధం. ఉర్దూ యూనివర్సిటీ ఏర్పాటు చేసింది చంద్రబాబే. ఉర్దూ టీచర్లకు ప్రత్యేక డీఎస్సీ నిర్వహించాం. ఫరూక్ కు మంత్రి పదవి, షరీఫ్ కు మండలి చైర్మన్ పదవి ఇచ్చాం. షరీఫ్ ను మండలిలో కొట్టి వైసీపీ అవమానించింది. ముస్లింల రిజర్వేషన్ల కోసం అధికార పార్టీ పోరాడకుంటే సొంత నిధులు ఖర్చు పెట్టి మేము పోరాడుతున్నాం. రెసిడెన్షియల్ కాలేజీ కేటాయించింది పనులు ప్రారంభిస్తే ఈ ప్రభుత్వం నిలిపేసిందని అన్నారు.

ఇంట్లో వృద్ధులు ఉన్నా..ఒంటరి మహిళలు ఉన్నా చంద్రబాబు పెన్షన్ ఇచ్చారు. కానీ ఈ ప్రభుత్వం ఒకరికే ఇస్తోంది. బీడీ కార్మికుల భవిష్యత్ పై ఆలోచిస్తాం. ముస్లింలను టీడీపీ ఏ విధంగా ఆదుకుంది, చూసుకుంది ఒక్కసారి ఆలోచించాలి. ముస్లింల రాజకీయ ఎదుగుదల వెనక టీడీపీ ఉంది. వచ్చేది టీడీపీ ప్రభుత్వమే..రాగానే ముస్లింలకు ఇచ్చిన హామీలు మూడేళ్లలోపే అమలు చేస్తామని లోకేష్ అన్నారు.

## ఘనంగా తిరుపతి 893వ జన్మదినం



**ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి**

**తిరుపతి**

తిరుపతి పుణ్యక్షేత్రం ఆవిర్భవించిన దినోత్సవం సందర్భంగా ఈ నెల 24వ తేది శుక్రవారం తిరుపతి నగరానికి పుట్టినరోజు కార్యక్రమాన్ని వైబోత్సవంగా జరుపుకుందామని తిరుపతి శాసన సభ్యులు, మానవ వికాస వేదిక గౌరవ అధ్యక్షులు భూమన కరుణాకర రెడ్డి కోరారు. తిరుపతిలో మంగళవారం జరిగిన మీడియా సమావేశంలో తిరుపతి నగరపాలక సంస్థ మేయర్ డాక్టర్ శిరీష, మానవ వికాస వేదిక కన్వీనర్లు శైలకుమార్, సాకం నాగరాజు, డిప్యూటీ మేయర్ ముద్ర నారాయణ, మునిసిపల్ స్టాండింగ్ కమిటి సభ్యులు ఎస్.కె.బాబులతో కలిసి మానవ వికాస వేదిక గౌరవ అధ్యక్షులు, తిరుపతి ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి మాట్లాడుతూ పుట్టిన రోజు జరుపుకోవడం అన్నది మనిషికే కాదు నగరానికి కూడ చాలా అవసరమని, అందులోను కలియుగ ప్రత్యక్ష దైవమైన తిరుమల శ్రీవారి పాద పీఠ నగరంగా వెలసిన మన తిరుపతి మరింత ప్రత్యేకమని తెలియజేస్తూ, మనం మన నగర జన్మదినాన్ని అందరం కలసి అత్యంత వైభవంగా జరపుకుందామన్నారు. సౌమ్యనామ సంవత్సరం పాల్గుణ పౌర్ణమి, ఉత్తరా నక్షత్ర సోమవారం ఫిబ్రవరి 24వ తేది 1130 వ సంవత్సరం తిరుపతి నగరం ఆవిర్భవించిందన్నారు. భగవద్ రామానుజాచార్యుల వారు తిరుపతిలో ఆరోజున శ్రీ గోవిందరాజస్వామి వారిని ప్రతిష్ఠించి, కైంకర్య నిర్వహణ కార్యక్రమాలు రూపొందించి, నాలుగు మాడవీధుల నిర్మాణం ప్రారంభించారని, అదే మన నగర జన్మదిన విశిష్టతన్నారు. రామానుజుల

(మిగతా 2లో)

# తెలుగు మాతృభాషఉన్నవారు అదృష్టవంతులు

**ప్రజాతపన.**

ఫిబ్రవరి 21 వ తేదీ అంతర్జాతీయ మాతృ భాషా దినోత్సవాన్ని పురస్కరించుకొని ఫిబ్రవరి 21 %డ% 22,2023 వ తేదీలలో ఆంధ్రవిశ్వవిద్యాలయం తెలుగు విభాగం మరియు సమైక్య భారతి ,తెలుగు విభాగం ,డా వియస్ కృష్ణ ప్రభుత్వ డిగ్రీ & పి జి కళాశాల,విశాఖపట్నం సంయుక్త ఆధ్వర్యంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం-తెలుగు ప్రాశస్త్యంఅనే అంశంపై అంతర్జాతీయ సదస్సుఆంధ్ర విశ్వకళాపరిషత్ టి యల్ యన్ సభాహాల్ లో ప్రారంభమైంది.ఈ సమావేశానికి తెలుగు శాఖాధ్యక్షులు ఆచార్య జర్రా అప్పారావు సభాధ్యక్షులుగా వ్యవహారించారు .ముఖ్య అతిధిగా విచ్చేసిన ఆంధ్రవిశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి ముఖ్యఅతిధిగా విచ్చేసి విద్యార్థులు మాతృభాషలో విద్యాబోధన చేసినప్పటికీ మిగిలిన భాషలను నేర్చుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందని తాను ఆ విధంగానే చదువుకొని ఇప్పుడు ఈ స్థాయికి వచ్చానని నేనే కాదు ఇక్కడ వేదిక మీద ఉన్నవాళ్ళంతా ఆ విధంగానే వచ్చారని,తన హృదయంలో మాతృభాష ఉందని అది అమ్మభాషని దానిని తొలగించటం ఎవరికీ సాధ్యంకాదన్నారు. ఉపాధికోసం ఆంగ్లభాషను నేర్చుకున్నప్పటికీ మాతృభాష మరవకూడదన్నారు. భారత దేశం విభిన్న మతాలకు,భాషలకు ఆలవాలమైన స్థానమని ప్రపంచంలో ఏ దేశానికి లేని ప్రత్యేకత మన దేశానికే ఉందని అందుకే ప్రపంచంలో ఏ ప్రాంతానికైనా మన భారతీయులు వెళ్ళి ఉన్నత స్థానాలలో స్థిరపడుతున్నారని, భారతీయుల మధ్య వైవిధ్యభరితమైన భాషాభేదం ఉన్నప్పటికీ అందరిని ఏకసూత్రపై నడిపే శక్తి ఉందని, ప్రపంచభాషలన్నిటినీ తమలో కలుపుకునే శక్తి మన మాతృభాషకుందని అటువంటి గొప్ప భాషను ఆధునిక సాంకేతికతను జోడించి అధ్యాపన,బోధన చేయవలసిన అవసరం ఉందని చెప్తూ పోతన భాగపద్యాలలో సుమధురమైన మాధుర్యం ఇమిడి ఉందన్నారు.తెలుగు విభాగం నిర్వహిస్తున్న ఈ అంతర్జాతీయ సదస్సు విశ్వవిద్యాలయానికి పండుగ వాతావరణం తెచ్చిందని తానెప్పుడో మర్చిపోయిన పంచెకట్టు ను కట్టించి ఆనాటి మధుర ్ఞపకాలను




పదిలపర్చుకునేలా ఈ సదస్సు చేసిందన్నారు. అటువంటి మాతృభాషను మర్చిపోతే మనకు మనుగడ లేదన్నారు.

గౌరవ అతిథిగా విచ్చేసిన ఆర్ట్స్ & సైన్స్ కళాశాల ప్రిన్సిపాల్ ఆచార్య ఎ నరసింహారావు మాట్లాడుతూ తెలుగు విభాగం పూర్వకాలం నుండి ఎంతో మంది ప్రముఖ ఆచార్యులను అందించిన ఘనతగల విభాగం అని అటువంటి విభాగం అంతర్జాతీయ సదస్సును ఏర్పాటుచేసి విదేశాలనుండి పండితులను తీసుకువచ్చి తెలుగుభాషా మాధుర్యాన్ని తెలియజేయటం అభినందనీయం అన్నారు.ప్రతి ఒక్కరూ తల్లిని గౌరవించినట్లే మాతృభాషను గౌరవించాలన్నారు. అప్పుడే మనిషికి విలువఉంటుదన్నారు.విశిష్ట అతిథిగా విచ్చేసిన ఆచార్య శలాక రఘునాధశర్మ ప్రసంగిస్తూ అమ్మ అన్న పిలుపులోనే కమ్మదనం నిండి ఉందని అమ్మ పిలుపులోనాలుగు అక్షరాలు ఇమిడి ఉన్నాయని మొదటి అక్షరం కంఠమూలం నుండి అ పెదవుల ఉచ్చారణలో మ మరల పెదవుల ఉచ్చారణలో మ నుండి కంఠమూలం కు అ ఈ విధంగా కంఠమూలం నుండి పెదవుల వరకు పెదవుల నుండి కంఠమూలంవరకు తిరిగే శబ్దం అమ్మ అని అటువంటి అక్షర విన్యాసం కల అద్భుత భాష మన మాతృభాష అని కొనియాడారు. తెలుగు లాలత్వంకలిగిన వన్నెచిన్నెలవంటి నదుల వంటిదని అది నదివలె హొయలందే భాషని నదులు ఏ విధంగా నేలను సస్యశ్యామలం చేస్తూ బంగారుపంటలు పండించగల శక్తి ఉన్నదో అదేవిధంగా మాతృభాషకు ఉందని అటువంటి మాతృభాషను ప్రామాణికంగా నేర్చుకుంటే ఉపాధిఅవకాశాలు మెండుగా ఉంటాయన్నారు .ప్రత్యేక అతిథిగా సెంట్రల్ ఇనిస్ట్యూట్ ఆఫ్ ఓరియంటల్ లాంగ్వేజస్ అండ్ సివిలిజేషన్ (ప్యారిస్-ఫ్రెంచి) విశ్వవిద్యాలయం నుండి విచ్చేసిన ఆచార్య డానియేల్ నేజర్స్ మాట్లాడుతూ ప్రపంచంలో అందరికీ మాతృభాషలున్నప్పటికీ తెలుగు మాతృభాషకల మీరందరూ అదృష్టవంతులని,తెలుగు భాష సరళసుందరమైన భాషని దీనిని సులభంగా నేర్చుకోవచ్చని నేను అలా తెలుగు భాషను సులభంగా నేర్చుకున్నానని తెలుగు సంస్కృతి సంప్రదాయాలు ఏంతో గొప్పవని ఆంధ్రవిశ్వకళాపరిషత్,తెలుగు విభాగం తమను ఆహ్వానించటం ఏంతో ఆనందంగా ఉందని ఉపకులపతి ఆచార్య పివిజిడి ప్రసాదరెడ్డి గారు ఆలపించిన పోతన భాగవత పద్యాన్ని తను ఫ్రెంచిభాషలోకి అనువదిస్తున్నానని అప్పటికప్పుడు ఆయన అనువదించి ఆలపించారు.ఈ సందర్భంగా మాట్లాడుతూ తెలుగు భాషలో అద్భుతమైన సాహిత్యం ఉందని ఆ సాహిత్యాన్ని భావితరాలవారు కాపాడుకోవలసిన బాధ్యత ఉందన్నారు.ఆత్మీయ అతిథిలుగా విచ్చేసిన ఆచార్య కప్పగంతుల శ్రీనివాస్ మాట్లాడుతూ తెలుగు భాష లో సాంకేతిక అభివృద్ధి పర్చవలసిన ఆవశ్యకత ఉందన్నారు .అందుకోసం తను కృషిచేస్తున్నానన్నారు.మరొక అత్మీయ అతిథి ఆచార్యవెలమల సిమ్మన్న మాట్లాడుతూ తెలుగు భాషా పరిరక్షణకు యువత నడుంబిగించాలని పిలుపునిచ్చారు.సదస్సు సమన్వయం గురించి డా మూర్తి రేమెళ్ళ తెలియజేసారు.అనంతరం పరిశోధక విద్యార్థి ఇళ్ళ మురళీధరరావు ఇతిహాసపాత్రలతో రచించిన ఏకపాత్రాభినయం అనే సాంఘీకనాటికల సంపుటిని ఆవిష్కరించారు.ఈ కార్యక్రమంలో సినీసంగీత దర్శకులు సాలూరు వాసూరావు,డా యస్ విజయకుమార్ ,తెలుగు ఆచార్యులు డా అయ్యగారి సీతారత్నం,డా అన్నంశెట్టి ఈశ్వరమ్మ,డా బూసి వెంకటస్వామి,డా కట్టెపోగు రత్నశేఖర్ ,డా పెండ్యాల లావణ్య,శ్రీ



ఆతుకూరి వెంకటేశ్వర్లు(యోగి) తదితరులు పాల్గొన్నారు. మధ్యాహ్నం తెలుగు సమావేశ మందిరంలో రెండు సమావేశాలలో వివిధ విశ్వవిద్యాలయాలు,కళాశాలలు నుండి వచ్చిన ఆచార్యులతో పాటు పరిశోధక విద్యార్థులు తెలుగు భాషా వినియోగం,ఉపాధి అవకాశాలు,తెలుగు భాషా పరిశోధన పోకడులు ,తెలుగు సామెతలు,పోడుపుకథలు వంటి అంశాలపై సమావేశాలు ఏర్పాటు చేయబడ్డాయి.ఈ సమావేశాలలో మొదటి సమావేశానికి అధ్యక్షులుగా డా కట్టెపోగు రత్నశేఖర్ ,సమన్వయకర్తగా ఉస్మానియా విశ్వవిద్యాలయ విశ్రాంతాచార్యులు వెలుదండ నిత్యానందరావు,రెండవ సమావేశానికి శ్రీ ఆతుకూరి వెంకటేశ్వర్లు అధ్యక్షులుగా డా పెండ్యాల లావణ్య సమన్వయకర్తగా వ్యహరించగా 20 మంది ప్రతినిధులు సప్రమాణికమైన పరిశోధనా పత్రాలను సమర్పించారు. తెలుగు భాషపై పరిశోధన చేసేటప్పుడు పూర్వ ఆచార్యుల పరిశోధనా పద్ధతులు పాటిస్తూనే ఆధునిక పరిశోధనా విధానాలు పుణికి పుచ్చుకున్నప్పుడే సిద్ధాంతగ్రంధానికి విలువ వస్తుందని ఆచార్య వెలుదండ నిత్యానందరావు వివరించారు. తెలుగు సామెతలను ఆధునిక విధానంలో సేకరించవలసిన ఆవశ్యకత ఉందని ఇంతకముందు ఉన్న సామెత స్థానంలో పట్టణ నాగరికతా ఆనవాళ్ళు చొప్పించుకొని సామెతలు ఆవిర్భవించాయని అటువంటి సమయంలో పాత కొత్త సామెతల తులనాత్మక అధ్యయనానికి విద్యార్థులు పూనుకోవాలని డా పెండ్యాల లావణ్య వెల్లడించారు.ఈ సమావేశాలలో పరిశోధక విద్యార్థులు డా యల్ గిరీష్ కుమార్,పట్నాన ధర్మారావు,వేదుల హిమబిందు,డా రాజులపాటి శివయ్య,కోష్ట గోవిందరావు,కె కుశరాజు,డా పి దాసు,డా యం ప్రతాప్ పరిశోధక విద్యార్థులు మరియు స్నాతకోత్తర విద్యార్థులు పాల్గొన్నారు

# మాతృభాష ఉనికిని నిలబెట్టుకోవడానికి కృషి చేయాలి

**ఆచార్య జి. ఎమ్. సుందరవల్లి**

**ప్రజాతపన**

“అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవాన్ని “ ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్రం ఘనంగా నిర్వహించింది. ఈ కార్యక్రమానికి విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య జి. ఎమ్. సుందరవల్లి ముఖ్య అతిథిగా హాజరయ్యారు.ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మాతృభాషలో తమ భావాలను వ్యక్తం చేయడమేకాదు, దాని ఉనికిని నిలబెట్టుకోవడానికి అందరూ కృషి చేయాలని






అన్నారు. “అభివృద్ధి,శాంతి భద్రతలు -సయోధ్యకు, దేశీయతకు ఉపయోగపడుతాయి.” అన్న ఈయేడాది యునెస్కో నేపథ్యాన్ని గుర్తుచేశారు. అలాగే ప్రపంచంలో చిన్న, పెద్ద భాషలనన్నింటిని రక్షించుకోవాలని, భాషా వైవిధ్యాన్ని కాపాడుకోవడం ద్వారానే మనం జీవ వైశిష్ట్యాన్ని సంరక్షించుకోగలమని నొక్కి వక్కాణించారు. ప్రాచీన తెలుగు విశిష్ట అధ్యయన కేంద్ర సంచాలకులైన ఆచార్య మాడభూషి సంపత్ కుమార్ ఈ సదస్సుకు అధ్యక్షులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమానికి విశిష్ట అతిథిగా దివ్యాంగుల నైపుణ్యాభివృద్ధి ప్రాంతీయ కేంద్రం డైరెక్టర్ డా. రాజ్ మణిపాల్, గౌరవ వక్తలుగా డా. మాచవోలు శివరామ ప్రసాద్, డా. మాలకొండయ్య, డా. దివ్య, డా. రాజారామ్ మున్నగువారు హాజరై సమావేశాన్ని ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సదస్సులో కేంద్ర విద్యాత్మక సిబ్బందితో పాటు నగరంలోని భాషాభిమానులు,సాహితీ వేత్తలు, పరిశోధకులు, విద్యార్థులు పాల్గొని విజయవంతం చేశారు.

# రాష్ట్ర ప్రభుత్వానికి సహకారం, వాత్యల్యం అందించారు

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వాలకు మధ్య సంబంధాల మీద ఈ మధ్య కాలంలోనే చాలా సందర్భాలలో వార్తలు చూస్తూనే ఉన్నాం. కానీ మన రాష్ట్రం మాత్రం అందుకు భిన్నంగా, తండ్రిలా, పెద్దలా ఈ రాష్ట్ర ప్రయోజనాల విషయంలో ఇక్కడి ప్రజా ప్రభుత్వానికి సంపూర్ణంగా సహకరిస్తూ మన గవర్నర్ వాత్సల్యం చూపించారని అన్నారు.

మన గవర్నర్ విషయాలు క్లుప్తంగా నెమరువేసుకోవాలి. హరిచందన్ గారు ఉన్నత విద్యావేత్త. న్యాయనిపుణులు. వీటన్నింటికీ మించి ఆయన స్వాతంత్ర్య సమరయోధులు కూడా. ఒడిశా ప్రభుత్వంలో నాలుగుసార్లు మంత్రిగా పనిచేసారని అన్నారు. ఐదు సార్లు ఒడిశా అసెంబ్లీకి ఎన్నికైన ఆయన 2000 సంవత్సరంలో జరిగిన ఎన్నికల్లో తన సమీప ప్రత్యర్థిపై 95 వేల మెజార్టీ సాధించి అప్పట్లో ఒక రికార్డు సృష్టించారు. న్యాయవాదిగా కూడా పనిచేసిన బిశ్వభూషణ్ హరిచందన్ ఒడిశా హైకోర్టులో బార్ అసోసియేషన్ యాక్షన్ కమిటీ ఛైర్మన్గా కూడా న్యాయవాదుల సంక్షేమం కోసం, హక్కుల కోసం నిరంతరం పాటుపడ్డారు.

బిశ్వభూషణ్ హరిచందన్ కు ప్రతిచోటా కూడా వెన్నుదన్నుగా నిల్చి ఆయన విజయానికి కారణమయ్యారు ఆయన సతీమణి సుప్రవ హరిచందన్. ఆమెకి కూడా ఈ రాష్ట్ర ప్రజలు, ప్రభుత్వం తరపున, నా కుటుంబం తరపున ధన్యవాదాలు తెలియజేస్తున్నానని అన్నారు.

చివరిగా దేవుడి దయ, ప్రజలందరి చల్లని దీవెనలతో బిశ్వభూషణ్ హరిచందన్, వారి కుటుంబం నిండు నూరేళ్లు జీవించాలని అందరికీ ఇంకా ఎంతో సేవ చేయాలని మనసారా కోరుకుంటూ.. మీతో మా తీపి జ్ఞాపకాలు మా మనసులో ఎల్లప్పుడూ ఉంటాయని తెలుపుతూ సెలవు తీసుకుంటున్నాను అని సీఎం ప్రసంగం ముగించారు. తరువాత ముఖ్యమంత్రి గవర్నర్

# ఘనంగా తిరుపతి 893వ జన్మదినం

(మొదటిపేజీ తరువాయి)

రాక పూర్వం తిరుపతి పట్టణం లేదని, శ్రీవారి ఉత్సవాలన్ని తిరుచానూరులోనే జరిగేవన్నారు. ప్రపంచంలో చరిత్ర కలిగిన నగరాలు చాలావున్నాయని, అవి కూడ ఉత్సవాలు జరుపుకుంట్టున్నాయని, కాని నగర అంకురార్పణ జరిగిన ఖచ్చితమైన తేది ఏ నగరానికి లేదని చెబుతూ,. ఒక్క తిరుపతికి మాత్రమే ఖచ్చితమైన ప్రారంభ తేది వుందన్నారు. సమతా ధర్మాన్ని స్థాపించి, తిరుమల శ్రీవారి నిత్య పూజా కైంకారాల నియమాలను స్థిరీకరించిన భగవద్ రామానుజులు తిరుపతి నగర ఆవిర్భావ కారకులని, ఆ పవిత్రమూర్తి హస్త స్పర్శచే పులకించిన పట్టణం తొలుత గోవిందరాజ పట్టణంగా, తరువాత రామానుజపురంగా పిలిచేవారని, 13వ శతాబ్దపు ప్రారంభంనుంచి తిరుపతిగా పిలుస్తున్నట్లు భూమన వివరించారు. అంతటి పవిత్ర నగరంలో వున్నందుకు గర్వపడుతూ ఫిబ్రవరి 24న నగరపు 893వ జన్మదినం వైభవంగా జరుపుకొని తిరుపతి నగర ప్రజలను చూసి ప్రపంచం గర్వపడేలా చేద్దామని ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి ప్రజలందరిని ఉద్దేసించి విజ్ఞప్తి చేసారు. అనంతరం శ్రీ గోవిందరాజస్వామి ఆలయంలో విచ్చేసి వున్న పెద్ద జీయంగారు, చిన్న జీయంగార్ల వద్దకు చేరుకొని తిరుపతి పుట్టిన రోజు వేడుకలకు రావల్సిందిగా కోరుతూ మొదటి కర పత్రాలను వారికి అందించి, వారి నుండి ఆశీస్సులు తీసుకొని ప్రజల భాగస్వామ్యం కోరుతూ ఎమ్మెల్యే భూమన కరుణాకర రెడ్డి కర పత్రాలను పంచడం జరిగింది. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు రామస్వామి వెంకటేశ్వర్లు, నరసింహాచారి, మునిసిపల్ కో ఆప్షన్ సభ్యులు వెంకటరెడ్డి, ఉదయ్ వంశీ, తొండమనాటి వెంకటేష్ రెడ్డి, వెంకటేష్ రాయల్, చంద్రారెడ్డి, శ్రీసిటి మేనేజర్ రామచంద్రా రెడ్డి పాల్గొన్నారు.

# దేశం ఏదైనా కష్టాల్లో ఉంటే మానవత్వంతో సాయం చేయడమే భారత విధానం

(మొదటిపేజీ తరువాయి)

బృందాల వారితో ఆటోగ్రాఫ్‌లు కూడా తీసుకున్నారు.తుర్కియే, సిరియాల్లో రెండు వారాల క్రితం 7.8 తీవ్రతతో భారీ భూకంపం సంభవించింది. భూకంపం ధాటికి లక్షల ఇళ్లు, భవనాలు నేల కూలాయి. వేలాది మంది శిథిలాల కింద చిక్కుకొని 46 వేల మందికి పైగా మృత్యువాత పడ్డారు.భూకంపం సంభవించిన వెంటనే ఆపరేషన్ దోస్త్ పేరిట భారత ప్రభుత్వం సహాయక బృందాలతో పాటు సహాయక సామాగ్రిని, ఔషదాలను పంపింది. డాగ్ స్క్వాడ్‌లను కూడా పంపించింది. నుర్దాగీ, అంటక్యా ప్రాంతాల్లో 12 రోజుల పాటు భారత సహాయక బృందాలు సేవలందించాయి. ఎన్డీఆర్ఎఫ్‌తో పాటు భారత సైన్యం కూడా వైద్య సేవల్లో పాలుపంచుకుంది. గాయపడ్డవారికి సైనిక డాక్టర్లు, నర్సులు సేవలందించారు. అనేకమంది ప్రాణాలు కాపాడారు. ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది అయితే రేయింబవళ్లూ శిథిలాలను తొలగిస్తూ అనేకమందిని కాపాడారు. తుర్కియే, సిరియా దేశాల సిబ్బందితో పాటు స్థానికుల సహకారం కూడా తీసుకుని అనేక మంది ప్రాణాలను ఎన్డీఆర్ఎఫ్ సిబ్బంది కాపాడారు. భారత సహాయక బృందాల సేవలను ఐక్యరాజ్యసమితి సహా అనేక దేశాలు మెచ్చుకున్నాయి.కష్టకాలంలో సత్వరమే స్పందించి సహాయక బృందాలను పంపినందుకు తుర్కియే, సిరియా భారత ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపాయి. భూకంపవేళ రావాలనుకున్న పాక్ ప్రధానిని తుర్కియే వద్దంది.

ప్రజా తపన
prajathapana.com

# వైసీపీ వర్సెస్ టీడీపీ

**విజయవాడ :**

గన్నవరం టీడీపీ కార్యాలయంపై ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులు దాడి చేశారంటూ.. ఆయనపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు పట్టుబట్టడం ఈ ఘర్షణలకు కారణమైంది. పోలీసులు చర్యలు తీసుకోకపోతే వైసీపీ కార్యాలయాన్ని ముట్టడిస్తామని తెలుగుదేశం నాయకులు హెచ్చరించారు. గన్నవరం పోలీస్ స్టేషన్ ముందు పట్టాభి సహా పలువురు టీడీపీ కార్యకర్తలు ఆందోళనకు దిగారు. దీనికి కౌంటర్‌గా ఆందోళన చేపట్టారు వైసీపీ కార్యకర్తలు. వాళ్లంతా టీడీపీ ఆఫీస్‌ను ముట్టడించారు. కొందరు కార్యకర్తలు రాళ్లు రువ్వడం, ఫర్నీచర్ ధ్వంసం చేయడంతో ఒక్కసారిగా పరిస్థితి అదుపు తప్పింది. ఈ క్రమంలో గుర్తు తెలియని వ్యక్తులు టీడీపీ కార్యాలయాన్ని ధ్వంసం చేయడమే కాకుండా అక్కడ ఉన్న ఐదు వాహనాలను తగులబెట్టారు. ఈ ఘటనలు గన్నవరంలో బీభత్సం సృష్టించాయి.అయితే వంశీ ప్రోద్బలంతోనే తమ కార్యాలయంపై దాడులతో అద్దాలను, ఫర్నీచర్ ధ్వంసం చేయడమే కాకుండా అక్కడ నిలిపి ఉంచిన వాహనాలను తగులబెట్టారని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. మరోవైపు రెండు రోజుల నుంచి టీడీపీ, వైసీపీ కార్యకర్తల మధ్య ఘర్షణలు జరుగుతున్నాయి. ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకోవడమే కాకుండా ఘర్షణలకు దిగుతున్నారు. బీసీలపై దాడులు చేయిస్తున్నారంటూ వంశీపై చర్యలు తీసుకోవాలని టీడీపీ నేతలు ఫిర్యాదు చేసేందుకు పోలీస్ స్టేషన్ వద్దకు చేరుకున్నారు. అక్కడ స్టేషన్‌కు ఎదురుగా వంశీకి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. రెండ్రోజుల క్రితం టీడీపీ అధినేత చంద్రబాబు, లోకేశ్‌పై ఎమ్మెల్యే వల్లభనేని వంశీ వ్యక్తిగత విమర్శలు చేశారు. దీంతో ఆగ్రహించిన టీడీపీ నేతలు వంశీపై విమర్శలు చేశారు. వంశీపై విమర్శలు చేయడాన్ని తట్టుకోలేకపోయిన ఆయన అనుచరులు టీడీపీ ఆఫీస్ పై దాడి చేశారు. టీడీపీ నేత దొంతు చిన్నా ఇంటిపై దాడికి ప్రయత్నించారు. పోలీసులు సమక్షంలోనే ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులు గన్నవరం టీడీపీ కార్యాలయంపై దాడి చేశారని టీడీపీ ఆరోపిస్తుంది. టీడీపీ ఆఫీస్ పై దాడి చేసి కంప్యూటర్లు, ఫర్నీచర్ ధ్వంసం చేశారని, ఆఫీస్ ఆవరణలో ఉన్న వాహనాలపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టారని ఆగ్రహం వ్యక్తంచేసింది. ఇదంతా తాడేపల్లి కుట్ర అని విమర్శించింది. గన్నవరం ఎమ్మెల్యే వంశీకి బుద్ధా వెంకన్న సవాల్ విసిరారు. దమ్ముంటే రేపు మధ్యాహ్నం 12 గంటలకు ఎన్టీఆర్ విగ్రహం వద్దకు రావాలన్నారు. టీడీపీ కార్యాలయంపై దాడి ఘటనపై ఎమ్మెల్యే వల్లభనేని వంశీ స్పందించారు. గొడవ జరుగుతొందని తెలిసే గన్నవరం వచ్చానన్నారు. నన్ను, కొడాలి నానిని ఇష్టం వచ్చినట్లు టీడీపీ నేతలు బూతులు తిట్టారని వంశీ ఆరోపించారు. గొడవలో నా పాత్ర చాలా చిన్నదని వంశీ అన్నారు. నాపై నోటికి వచ్చినట్లు మాట్లాడుతున్నారని మండిపడ్డారు. గన్నవరంలో జరిగే ప్రతి విషయానికి నాకు సంబంధంలేదన్నారు. ఈ క్రమంలోనే విజయవాడ గన్నవరం జాతీయ రహదారిపై టీడీపీ నేతలు, కార్యకర్తలు ధర్నాకు దిగారు.కాగా, రెండు రోజుల కిందట టీడీపీ నేతలకు సీరియస్ వార్నింగ్ ఇచ్చారు గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ. తన గురించి తప్పుగా వాగితే గన్నవరం అంటే ఏమిటో చూపిస్తానన్నారు వంశీ. చంద్రబాబు, లోకేష్‌లకు దమ్ముంటే తనపై పోటీ చేయాలని సవాల్ కూడా చేశారు వంశీ

# సోషల్ ఇంజనీరింగ్ తో ఎమ్మెల్సీ పదవులు

**విజయవాడ :**

ఎన్నికల వ్యూహానికి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ తెర తీసింది. ఎమ్మెల్సీ కోటాలో పదవుల పంపకాల్లో పక్కాగా సామాజిక వర్గాల సమీకరణాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చింది. టార్గెట్ 175 లో భాగంగా ఏపీ సీఎం వైఎస్ జగన్ వ్యూహాత్మకంగా అభ్యర్థులను ఎంపిక చేశారు.ఆంధ్రప్రదేశ్ లో అధికార పార్టీ చెందిన ఆశావహులకు ఎమ్మెల్సీ స్థానాల్లో అవకాశం కల్పిస్తూ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి కీలక నిర్ణయం తీసుకున్నారు. పార్టీ ఆవిర్భావం నుంచి పని చేస్తూ, ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి నష్టపోయిన విధేయులకు జగన్ ప్రాధాన్యం ఇచ్చారు. అంతే కాదు సామాజిక వర్గాల వారీగా కీలకమయిన అంశం కావటంతో, జగన్ ఆచి తూచి వ్యవహరించినట్లుగా పార్టీ వర్గాలు చెబుతున్నాయి. గతంలో ఎన్నడూ లేని విధంగా మోజార్టీ స్థానాలను బీసీ వర్గాలకు కేటాయించారు. ఇప్పటి వరకు సామాజిక కోణంలో పెద్దల సభలో అడుగుపెట్టని కులాలకు సైతం జగన్ అకాశం ఇచ్చారు. దీంతో ఆయా వర్గాలను పూర్తిగా ఆకట్టుకునేందుకు వీలవుతుందని పార్టీ భావిస్తోంది. టార్గెట్ 175 స్థానాల పైనే గంపెడు ఆశలు పెట్టుకున్న జగన్, ఇక రాబోయే రోజులను పూర్తిగా ఎన్నికల కోణంలో నే చూడాలని భావిస్తోందిని, అందులో భాగంగానే ఏడాది ముందుగానే పార్టీ శ్రేణులను ఉత్సాహపరిచేందుకు ఎమ్మెల్సీ ఎన్నికలను కేంద్రంగా చేసుకుందనే ప్రచారం జరుగుతోంది.వచ్చే అసెంబ్లీ ఎన్నికలను టార్గెట్ గా చేసుకుని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ కీలక నిర్ణయాలు తీసుకుంటోంది. ఇప్పటికే పార్టీ పరంగా ప్రత్యేక గృహ సారథులను రంగంలోకి దింపుతున్న వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ పూర్తిగా అన్ని వర్గాలను తన వైపునకు తిప్పుకునే ప్రయత్నం చేస్తోంది. ఇప్పుడు ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి వైసీపీ కీలకమయిన సామాజిక వర్గాలకు పెద్ద పీఠ వేసింది. అందులో భాగంగానే గతంలో ఎన్నడూ ప్రాదాన్యత దక్కని కులాలను వెతికి మరీ ఆయా ఎమ్మెల్సీ స్థానాలను ఆ వర్గాలకు కేటాయించారు సీఎం జగన్.ఎమ్మెల్సీ అభ్యర్థుల ప్రకటన తరవాత సీఎం జగన్ వారితో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. గతంలో ఎన్నడూ లేని విదంగా ఎమ్మెల్సీ స్థానాలకు అభ్యర్దులను ఎంపిక చేసిన ఘనత తమ ప్రభుత్వానికే దక్కుతుందని సీఎం జగన్ వ్యాఖ్యానించారు. పార్టీలో మెదటినుండి పని చేస్తున్న వారికి, కులాల వారీగా వారి శ్రమకు గుర్తింపు ఇస్తూ కీలకమయిన నిర్ణయం తీసుకున్నామని చెప్పారు. 18మందిలో కేవలం నాలుగు స్థానాలు మాత్రమే ఓసీలకు ఇచ్చామని, అధికంగా 14 స్థానాలను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన వారికి ఇవ్వటం ఆనందంగా ఉందన్నారు జగన్. గతంలో ఏ ప్రభుత్వం కూడా ఇలాంటి సాహసం చేయలేదని అన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలతో పాటుగా ఇవ్వని హామీలను కూడా అమలు చేశామని, అదే విధంగా సామాజిక వర్గాల కోణంలోనూ రాజకీయంగా అణచివేతకు గురయిన కులాలకు అధిక ప్రాధాన్యత ఇచ్చామని చెప్పారు. రాబోయే రోజుల్లో ఆయా సామాజిక వర్గాలకు మరింత ప్రాధాన్యం ఇస్తామన్నారు. బీసీ వర్గాలంటే కేవలం బ్యాక్ వర్డ్ క్యాస్ట్ కాదని, బ్యాక్ బోన్ క్లాస్ గా వైఎస్ఆర్ సీపీ ప్రభుత్వం అధికారంలో వచ్చిన తరువాత ఆయా వర్గాలకు తెలియచేశామని చెప్పారు. రానున్న రోజులు ఆయా వర్గాలు అన్నీ తిరిగి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు పూర్తిగా సహకరించాలని సీఎం జగన్

# అవినాష్ రెడ్డి చుట్టూ బిగిస్తున్న ఉచ్చు



**కడప :**

కడప ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డి చుట్టూ సీబీఐ ఉచ్చు బిగించిందా.. అంటే వైసీపీ శ్రేణుల నుంచే ఔనన్న మాట వినిపిస్తోంది. ఇప్పటికే ఒక సారి వైఎస్ అవినాష్ రెడ్డిని విచారించిన సీబీఐ తాజాగా మరో సారి విచారణకు పిలిచింది. ఈ సారి ఫిబ్రవరి 25న హైదరాబాద్ సీబీఐ ఆఫీసుకు రావాలని సీబీఐ ఆ నోటీసులలో ఆదేశించింది. అదే సమయంలో ఎంపీ అవినాశ్ రెడ్డి తండ్రి వైఎస్ భాస్కరరెడ్డికి కూడా నోటీసులు జారీ చేసింది. అయితే ఆయన ఎక్కడ విచారణకు హాజరౌతారో చెప్పాలని ఆయనకే ఛాయిస్ ఇచ్చింది. భాస్కరరెడ్డికి నోటీసుల విషయం పక్కన పెడితే.. నెల రోజులు కూడా పూర్తి కాకుండా అవినాష్ రెడ్డిని రెండో సారి విచారణకు పిలవడంతో అవినాష్ ను సీబీఐ అరెస్టు చేస్తుందన్న అభిప్రాయం విస్తృతంగా వ్యక్తం అవుతుంది. తొలి సారి ఆయనను విచారణకు పిలిచిన సందర్భంలోనే అవినాష్ అరెస్టు పై పెద్ద ఎత్తున ప్రచారం జరిగింది. ఎంపి కనుక అవినాష్ రెడ్డిని అరెస్టు చేయడానికి లోక్ సభ స్పీకర్ అనుమతి కూడా సీబీఐ తీసుకుందని అప్పట్లోనే గట్టిగా వినిపించింది. పైగా ఆనవాయితీకి భిన్నంగా అప్పట్లో ఆయనను సాయంత్రం నాలుగు గంటల సమయంలో విచారణకు హాజరు కావాల్సిందిగా సీబీఐ ఆదేశించడంతో.. అదే రోజు రాత్రి అయనను అరెస్టు చేసే అవకాశం ఉందని రాజకీయవర్గాలు అంచనా వేశాయి. అయితే అప్పట్లో సీబీఐ ఆయనను అరెస్టు చేయలేదు.. కానీ కీలక విషయాలను ఆయన నుంచి రాబట్టిందని అంటున్నారు. ముఖ్యంగా దర్యాప్తు తాడేపల్లి ప్యాలెస్ చేరుకునేందుకు అవసరమైన కీలక సమాచారం అవినాష్ రెడ్డి నుంచి రాబట్టిన సీబీఐ.. సీఎం జగన్ ఓఎస్డీ, జగన్ సతీమణి భారతి పిఎలను విచారణకు పిలిచి ప్రశ్నించడం అప్పట్లో సంచలనం సృష్టించింది. వివేకా హత్య ఘటన సాక్ష్యాలు మాయం చేయడం దగ్గర నుంచీ, ఆయన గుండెపోటుతో మరణించారన్న ప్రచారం వరకూ అన్నిటా అవినాష్ రెడ్డి పాత్రే కీలకమనీ సీబీఐ నిర్ధారణకు వచ్చిందని చెబుతున్నారు. వివేకా హత్య కేసు విచారణ ఏపీ నుంచి తెలంగాణకు మారిన క్షణం నుంచీ సీబీఐ దూకుడు పెంచింది. ఏపీలో విచారణ సందర్భంగా ఆ కేంద్ర దర్యాప్తు సంస్థ ఎన్నో అవరోధాలను ఎదుర్కొనడమే కాకుండా.. పలు అపవాదులనూ ఎదుర్కొంది. స్వయంగా దర్యాప్తు సంస్థ అధికారులపైనే కేసులు నమోదయ్యాయి. బెదరింపులూ వచ్చాయి. వీటన్నిటి వెనుకా ఉన్నది వైఎస్ అవినాష్ రెడ్డే నని సీబీఐ నిర్ధారణకు వచ్చిందని చెబుతున్నారు. అందుకే కేసును ఏపీ నుంచి మార్చాలంటూ.. వైఎస్ వివేకా కుమార్తె సునీతారెడ్డి సుప్రీంను ఆశ్రయించిన సందర్భంగా, సీబీఐ కూడా ఏపీ నుంచి కేసు విచారణను మార్చాలనే పేర్కొంది. ఆ సందర్భంగా సుప్రీం కోర్టుకు కేసు దర్యాప్తులో అవరోధాలకు సునీత చెప్పిన ప్రతి కారణమూ అక్షరసత్యమని వాంగ్మూలం కూడా ఇచ్చింది. వివేకా హత్య కేసు దర్యాప్తులో కడప ఎంపీ అవినాష్ రెడ్డి జోక్యం చేసుకుంటున్నారనీ, ఏపీలో నిష్పక్షపాత విచారణ జరుగుతున్న నమ్మకం లేదని, కేసు విచారణ బయట రాష్ట్రాలకు బదిలీ చేయాలని వివేకా కుమార్తె సునీతా రెడ్డి కోరగా, ఈ కేసు విచారిస్తున్న సీబీఐ కూడా సునీత చెప్పిన ప్రతి విషయం అక్షర సత్యమని సుప్రీం కోర్టుకు తెలియజేసింది. ఈ నేపథ్యంలోనే సుప్రీం కోర్టు కేసును తెలంగాణకు బదలీ చేసింది. అంతే అప్పటి వరకూ మందగమనంగా సాగుతున్న సీబీఐ దర్యాప్తు ఒక్కసారిగా జోరందుకుంది.కేసు హైదరాబాద్ కు మారిన తరువాత వైఎస్ వివేకా హత్య కేసు దర్యాప్తు జోరందుకోవడమే కాకుండా.. అంతకు మందు కేసు దర్యాప్తు ముందుకు సాగకుండా అధికారంలో ఉన్న జగన్ ప్రభుత్వం అడుగడుగునా అడ్డంకులు సృష్టించిందన్న అభిప్రాయాలు కూడా బలపడ్డాయి. ఇక గత జనవరిలో ఎంపీ వైఎస్ అవినాష్ రెడ్డిని సీబీఐ విచారించిన తరువాత ఈ హత్య కేసు పాత్ర ధారులే కాకుండా, వెనుక ఉన్న సూత్ర ధారుల విషయం కూడా వెలుగులోనికి వస్తుందన్న భావన సర్వత్రా వ్యక్తం అవుతోంది.

# జోరుగా చేరికలు

**విజయవాడ :**

ఆంధ్రప్రదేశ్ ఎన్నికలకు ఇంకా చాలా సమయం ఉంది. అయినా ఎన్నికల హీట్ మాత్రం రోజురోజుకూ పెరుగుతుంది. అన్ని పార్టీలూ ప్రజలను తమ వైపునకు తిప్పేందుకు ప్రయత్నాలు చేస్తున్నాయి. తమ పార్టీని మరింత బలోపేతం చేసుకునేందుకు అధికార వైసీపీ గృహసారధులను నియమించుకుంటోంది. ప్రతి యాభై ఇళ్లకు ఒక గృహసారధిని నియమించాలని జగన్ నిర్ణయించారు. ఇక టీడీపీ కూడా 30 ఇళ్లకో సాధికార సారధిని నియమించాలని నిర్ణయించింది. చంద్రబాబు జిల్లాల పర్యటన జోరుగా చేస్తుండగా, లోకేష్ పాదయాత్ర ప్రారంభించి ఇప్పటికే ఇరవై రెండు రోజులు దాటుతుంది. జనసేనలో మాత్రం ఇంకా జోష్ కనిపించడం లేదు. తెలుగుదేశం పార్టీలో చేరికలు కూడా జోరుగా సాగుతున్నాయి. అధికార వైసీపీ వైపుకు వచ్చి కూడా నేతలు కండువాలు కప్పుకుంటున్నారు ప్రభుత్వ వ్యతిరేకతతో టీడీపీయే అధికారంలోకి వస్తుందన్న నమ్మకంతో నేరుగా టీడీపీలో చేరేందుకే ఎక్కువ మంది ఇష్టపడుతున్నారు. బీజేపీ నుంచి రాజీనామా చేసిన కన్నా లక్ష్మీనారాయణ త్వరలో టీడీపీలో చేరతారని చెబుతున్నారు. చంద్రబాబు నుంచి కూడా హామీ లభించినట్లు వినపడుతుంది. ఆయన నిజానికి జనసేనలోకి వెళ్లాల్సి ఉన్నా తన మనసును మార్చుకుని టీడీపీలోకి వెళ్లాలని నిర్ణయించుకున్నారు. తాజాగా చిన్నోడో.. పెద్దోడో మహాసేన రాజేశ్ కూడా టీడీపీలో చేరిపోయాడు తప్ప జనసేన వైపు చూడలేదు. అదీ జనసేనకు పట్టున్న తూర్పు గోదావరి జిల్లా నుంచి రాజేశ్ టీడీపీలో చేరిపోయాడు. ఇక నెల్లూరు జిల్లాలో వైసీపీ నుంచి బయటకు వచ్చిన కోటంరెడ్డి శ్రీధర్ రెడ్డి కూడా టీడీపీ వైపు చూశారు తప్పించి జనసేన వైపు చూడలేదు. టీడీపీ, జనసేన కలసి పోటీ చేస్తాయన్న ప్రచారం ఊపందుకుంది. వచ్చే ఎన్నికల్లో కూటమిగా వెళ్లే అవకాశాలు 100శాతం ఉన్నాయని నేతలు కూడా నమ్ముతున్నారు. అలాంటి పరిస్థితుల్లో జనసేన వైపు చూడకుండా చంద్రబాబు చేత ఎందుకు కండువాలు కప్పించుకుంటున్నారన్నది మిలియన్ డాలర్ల ప్రశ్న. పవన్ పై నమ్మకం లేదా? అంటే అది కాదు. పవన్ నిజాయితీ కలిగిన నేత. అంతే కాదు ఎప్పుడు ఏ నిర్ణయం తీసుకుంటారో తెలియదు. అదే నేతలకు ఇబ్బందిగా మారుతుందంటున్నారు. నిలకడలేని రాజకీయ నేతలను ప్రజలు విశ్వసించరన్నది సీనియర్ రాజకీయ నేతలు కూడా భావిస్తున్నారు. అందుకే జనసేన కంటే పసుపు పార్టీ అయితేనే బెటర్ అని భావిస్తున్నారన్న వాదన వినిపిస్తుంది. నిజానికి జనసేనలో చేరి పొత్తులో భాగంగా టిక్కెట్ తెచ్చుకోవచ్చన్న భావన కూడా నేతలకు లేకుండా పోయింది. మరోవైపు టీడీపీ నుంచి టిక్కెట్ హామీ లభిస్తే ఆర్థికంగా కూడా ఆదుకుంటారు. పార్టీ నుంచి నిధులు భారీగానే అందుతాయి. కానీ జనసేన నుంచి మాత్రం నిధులను ఆశించడం అత్యాశ అవుతుంది. ఎన్నికల్లో కేవలం పవన్ చరిష్మాను మాత్రమే చూసి ఓటెయ్యాలని భావిస్తారు. కానీ ఎన్నికల్లో అది కుదరదు. అవతలి వారి కన్నా ఒక రూపాయి ఎక్కువ ఖర్చు పెట్టగలిగిన వారికే విజయం వరిస్తుందని నేతలు నమ్ముతారు. పవన్ పార్టీ ఆర్థికంగా పెద్దగా ఆదుకోరని భావించిన నేతలు జనసేన వైపు చూడటం లేదంటున్నారు. అందుకే ఎన్నికలు సమిపించినా జనసేనలోకి చేరికలు లేవంటున్నారు. పవన్ కూడా చేరికలను పెద్దగా పట్టించుకోవడం లేదు. కొత్త వారిని చేర్చుకుని తలనొప్పులు తెచ్చుకోదలచుకోలేదంటారు. అందుకే గాజు గ్లాస్ నిండటం లేదంటున్నారు.

# అనుమతులు లేని వెంచర్లతో ఇబ్బందులు

**వరంగల్ :**

అనుమతులు లేని వెంచర్‌లలో ప్లాట్లు కొన్న వారు తలలు పట్టుకుంటున్నారు. 2008 - 09 సంవత్సరంలో అక్రమ మార్గంలో అడ్డదిడ్డంగా సంపాదించాలని కొందరు స్థానిక వ్యాపారులు తమ భూములను గ్రామ పంచాయితీ నుండి ఎటువంటి అనుమతులు పొందకుండా వెంచర్‌లుగా మార్చారు. ఆ సమయంలో భూముల విలువలు తక్కువగా ఉండడంతో కొనుగోలు దారులు అందులో ప్లాట్లు కొనడానికి ఎగబడ్డారు.అందులో ప్లాట్లు కొన్న వారు ఇపుడు ఇల్లు నిర్మించుకోవడానికి నానా తంటాలు పడుతున్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పడ్డాక భూముల విలువలు అమాంతంగా పెరగడంతో అప్పుడు వెలిసిన వెంచర్‌లకి ఎలాంటి అనుమతులు లేకపోవడంతో అందులో ప్లాట్లకు ఇప్పుడు జీపీకి భారీ మొత్తంలో కొనుగోలు దారులు పెనాల్టీ రూపంలో కట్టాల్సిన పరిస్థితి నెలకొంది. దీనిపై ఈవో రాజుని వివరణ కోరగా అప్పట్లో వెంచర్ నిర్వాహకులు జీపీకి కేటాయించాల్సిన 10 శాతం స్థలం కేటాయించలేదన్నారు.అందులో ప్లాటు కొన్నవారు ఇప్పుడు ఇల్లు కట్టుకోవాలంటే ఇప్పటి ప్రభుత్వ నిబంధనల ప్రకారం 33% పెనాల్టీ జీపీకి కట్టాల్సి వుంటుందన్నారు. జీపీకి స్థలం కేటాయించిన కూడా లే ఔట్ అనుమతి లేకపోతే 24 శాతం పెనాల్టీ, డీటీసీపీ అనుమతులు ఉన్న వెంచర్‌లలో ఇంటి నిర్మాణ అనుమతికి 10 శాతం జీపీ కి రశీదు రూపంలో కట్టాల్సి ఉంటుందన్నారు.మండల కేంద్రంలో మొత్తం 21 వెంచర్‌లు ఉండగా ఇందులో 15 జీపీ అనుమతులు, 2 డీటీసీపీ అనుమతులు ఉన్నట్లు రాజు తెలిపారు. మిగిలిన 4 వెంచర్లు గ్రామ పంచాయతీ నుండి అనుమతులు లేకుండానే అప్పట్లో గుట్టు చప్పుడు కాకుండా ప్లాట్ల అమ్మకాలు జరిపినట్లు పేర్కొన్నారు. అక్రమ అమ్మకాలు చేపట్టిన వెంచర్‌ల సర్వే నంబర్లు వరుసగా 1070, 36,38 ,39, 991,992,994 లుగా ఉన్నాయన్నారు. తమ పరిధిలో ఉన్న వెంచర్‌లలో బోర్డులు ఏర్పాటు చేసినట్లు తెలిపారు

# మంథని సుందరీకరణపై ప్రత్యేక దృష్టి

**మంథని**

మంథని సుందరీకరణపై ప్రత్యేక దృష్టి సారించి మంథని వాసులకు ఆహ్లాదకరమైన వాతావరణం కల్పించేలా అభివృద్ధి పనులు చేపట్టనున్నట్లు పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధూకర్ తెలిపారు. మంగళవారం మంథని పట్టణంలోని తమ్మిచెరువు,రావుల చెరువు, బొక్కలవాగుపై జరుగుతున్న రహదారి పనులను పెద్దపల్లి జిల్లా పరిషత్ చైర్మన్ పుట్ట మధూకర్, మంథని మున్సిపల్ చైర్‌పర్సన్ పుట్ట శైలజ లు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా జడ్పీ ఛైర్మన్ పుట్ట మధు మాట్లాడుతూ మంథనికి చెందిన ఎంతోమంది ఇతర ప్రాంతాల్లో జీవనం సాగిస్తున్నారని, అలాంటి వారు ఇక్కడి వస్తే నగర వాతావరణం కన్పించేలా పనులకు శ్రీకారం చుట్టినట్లు ఆయనతెలిపారు. మంథనిలోని అనేక ప్రాంతాలను సుందరీకరించి ఆహ్లాదం పంచేలా అభివృద్ధి చేస్తామన్నారు. ఇందులో బాగంగా ఆయా చెరువు కట్టలపై వాకింగ్ ట్రాక్‌లు, సీసీ రోడ్లు, ఇతరత్రా సుందరీకరణ పనులు చేపట్టనున్నట్లు ఆయన తెలిపారు. ఇప్పటికే మంథనిని అన్ని విధాలుగా అభివృద్ధి చేయడం జరిగిందని, రాబోయే రోజుల్లో మరింత అభివృద్ధి చేసి చూపిస్తామని ఆయన చెప్పారు. రావులచెరువు




కట్టపై హనుమాన్‌టెంపుల్ వరకు సీసీ రోడ్డు, టెంపున్‌నుంచి శివకిరణ్ గార్డెన్ వరకు వాకింగ్ ట్రాక్, శివకిరణ్ గార్డెన్ నుంచి గురుకుల పాఠశాల వరకు వాకింగ్ ట్రాక్, తమ్మిచెరువు కట్టపై వాకింగ్ ట్రాక్ నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు. మంథనిని పూర్తిస్థాయిలో అభివృద్ధిపథంలోకి తీసుకెళ్లి ఆహ్లాదం పంచేలా సుందరీకరణ చేయడమే తమ ఆకాంక్ష, ఆలోచన అని ఆయన స్పష్టం చేశారు. అనంతరం మంథని బొక్కలవాగుపై ఏకో పార్క్ వరకు నూతనంగా చేపట్టిన సీసీ రోడ్డు పనులను ఆయన పర్యవేక్షించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ ఆరెపల్లి కుమార్, కౌన్సిలర్లు వికే రవి, కాయితి సమ్మయ్య, గర్రెపల్లి సత్యనారాయణ, కుర్ర లింగయ్య, నాయకులు నక్క శంకర్, కొట్టే రమేష్, సముద్రాల శ్రీనివాస్, గుండ పాపారావు, వేముల సమ్మయ్య, కొత్త బాలయ్య లతో పాటు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

## కెమికల్ వ్యాన్ లో మంటలు రెండు వాహనాలు దగ్ధం

**సంగారెడ్డి**

సంగారెడ్డి జిల్లా రామచంద్రపురం భీరంగుడ కమాన్ సమీపంలో జాతీయ రహదారి పై రసాయనాలతో నిండిన డ్రమ్ములు తీసుకెళ్తున్న డి సి ఎం లో అకస్మాత్తుగా మంటలు చెలరేగి అగ్ని కి ఆహుతి అయింది. మంగళవారం ఉదయం జరిగిన ఘటనలో పక్కనే వున్న మరో కారు కు మంటలు వ్యాపించడం తో కారు కాలిపోయింది. . విషయం గ్రహించిన డీసీఎం డ్రైవర్ వాహనాన్ని పక్కకు అపడంతో ఎలాంటి ప్రాణ నష్టం జరగలేదు. అగ్నిప్రమాదం సమాచారం అందుకున్న ఫైర్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకొని మంటలను అదుపు చేయడంతో పెను ప్రమాదం తప్పింది. జాతీయ రహదారి కావడం తో భారీగా ట్రాఫిక్ జాం అవ్వడంతో పోలీసులు చేరుకొని ట్రాఫిక్ క్లియర్ చేశారు.

## టీడీపీ నేతలు అరెస్టు?కేసులు నమోదు

**గన్నవరం**

సోమవారం గన్నవరం టీడీపీ కార్యాలయం ఘటన నేపథ్యంలో పలువురు టీడీపీ నేతలను పోలీసులు మంగళవారం ఉదయం హౌస్ అరెస్టులు చేసారు. నెట్టెం రఘురాం, తంగిరాల సౌమ్య, బోండా ఉమా, బుద్దా వెంకన్న లను హౌస్ అరెస్టులు చేసారు. ఎన్టీఆర్ సర్కిల్ కు రావాలని ఎమ్మెల్యే వల్లభనేని వంశీకి బుద్దా వెంకన్న సవాల్ విసిరారు. బోడె ప్రసాద్ ని నాగాయలంక పీఎస్ కి తరలించారు. నాగాయలంకలో ఉద్రిక్తత నెలకొంది. మరోవైపు, టీడీపీ నేతలపై పోలీసులు హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ సహా వివిధ సెక్షన్ల కింద కేసులు నమోదు చేశారు. వైసీపీ నేతల ఫిర్యాదు మేరకు 60 మందికి పైగా తెలుగుదేశం నేతలు, ఇతరులు పేరిట కేసులు నమోదయ్యాయి. గన్నవరం తెలుగుదేశం నేతలు దొంతు చిన్నా, దొంతు రాణి సహా మరో 30 మందికి పైగా తెలుగుదేశం శ్రేణులపై హత్యాయత్నం కేసు నమోదు చేశారు. 143, 147, 341, 333, 353, 307, 448, 143, 147, 506, 509 తీ/లి 149 సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి. పట్టాభి, మరో 16 మందిపై హత్యాయత్నం, ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ కేసులు నమోదు చేశారు పోలీసులు. బోడె ప్రసాద్ తో పాటు మరో 11మందిపై 353, 143, 147, 149 సెక్షన్ల కింద కేసులు నమోదయ్యాయి.

## బీరు బాటిల్ లో మందు పాతర

**ములుగు**

అడవిలోకి కూంబింగ్ వెళ్లే పోలీసులను లక్ష్యంగా చేసుకొని మావోయిస్టులు కొత్తరహా మందుపాతరలు తయరుచేస్తున్నారు. తాజాగా వెంకటాపురం పాముసూర్ అడవిలో బీర్ బాటిల్ లో ఐఇడి తో మందుపాతర దొరికింది. బీరు బాటిల్ లో మందపాతర నింపి వుంచడం పోలీసులు ఆశ్చర్యపరిచింది. ఏలాంటి అనుమానం రాకుండా పోలీసులే లక్ష్యంగా మందుపాతరను మావోలు అమర్చారు. చతిస్ఘడ్ డ్ అటవీ ప్రాంతం నుండి మావోయిస్టు అగ్రనేతలు తెలంగాణ గ్రామాలలో ప్రవేసించారని సమాచారంతో స్పెషల్ పార్టీ, సిఆర్పిఎఫ్ బెటాలియన్ పోలీసులు తనిఖీలు ముమ్మరం చేసారు. ఈ నేపథ్యంలో బీరుబాటిల్ వ్యవహారాన్నిగుర్తించారు. సకాలంలో దాన్ని నిర్వీర్యం చేయడంతో ముప్పు తప్పింది. ఏలూరు నాగారం ఏఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ మాట్లాడుతూ కరెంట్ వైర్, బీర్ బాటిల్, బోల్ట్ లు, కాపర్ సీల్, గన్ పౌడర్ స్వాధీనం చేసుకున్నాం. మావోయిస్టు అగ్రనేతలు చంద్రన్న, దామోదర్, కనకాల రాజిరెడ్డి, మంగు, సుధాకర్ వెంకటాపురం పోలీస్ స్టేషన్ తో కేసు నమోదు చేశామని వెల్లడించారు.

## భారీ సంఖ్యలో హరితహారం మొక్కలు దగ్ధం

**మహబూబాబాద్**

వేల సంఖ్యల హరిత హారం మొక్కలు దగ్ధం అయ్యాయి. పది హెక్టార్ల విస్తీర్ణంలో ఏరుమద్ది, రావి, మర్రి, నెమలి నారా, ఇరికి, మేడి మొక్కల పెంపకం.. ఏడాది లో రెండు సార్లు అగ్ని ప్రమాదం లో మొక్కలు ధ్వంసం అయ్యాయి. అటవీ శాఖ అధికారుల నిర్లక్ష్యంతో లక్షల రూపాయల ప్రభుత్వ నిధులు దుర్వినియోగం అవుతున్నాయి. కామారం బీట్ పరిధి 912,913,925 కంపార్ట్మెంట్ లో 10వేల మొక్కలు అగ్నికి ఆహుతయ్యాయి. ఆటవీ శాఖ అధికారులు గ్రామస్థులపై పోలీస్ స్టేషన్ లో పిర్యాదు చేసారు. తమ .తప్పును కప్పిపుచ్చుకునేందుకు అటవీ శాఖ అధికారుల ఆరోపణలని గ్రామస్థులు అంటున్నారు. మహబూబాబాద్ జిల్లా గంగారం మండలం కామారం బీట్ ప్లాంటేషన్ లో ఘటన జరిగింది.

## కుక్కల దాడిలో బాలుడు చనిపోవడం బాధాకరం-ఎమ్మెల్యే రాజాసింగ్

**హైదరాబాద్**

అంబర్ పేట్ వీధి కుక్కల దాడిలో నాలుగేళ్ళ బాలుడు చనిపోవటం బాధాకరమని ఎమ్మెల్యే రాజా సింగ్ అన్నారు. రాజకీయాలు పక్కన పెట్టి ప్రజా సమస్యలపై దృష్టి సారించాలని మంత్రి కేటీఆర్ కు సూచించారు. తన ఇంట్లో కూడా చిన్న పిల్లలు ఉన్నారన్న విషయాన్ని మంత్రి గుర్తుంచుకోవాలి. వీధి కుక్కల సమస్యపై మున్సిపల్ అధికారులు దృష్టి సారించాలి. నాలుగేళ్ళ బాలుడు ప్రదీప్ కుటుంబానికి ప్రభుత్వం ఆర్థికసాయం చేయాలని అయన అన్నారు.

# ఇంకా ఇరుకు సందుల్లోనే సభలు

**విజయవాడ :**

తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబు పర్యటనలు అంటేనే ఉద్రిక్తతల మధ్య సాగుతున్నాయి. టెన్షన్ నెలకొంటుంది. పోలీసులు అనుమతివ్వకపోవడం, దానిని టీడీపీ నేతలు ధిక్కరించడం మామూలు విషయంగా మారింది. జీవో నెంబరు 1 అమలులో ఉందంటూ పోలీసులు చెబుతున్నా.. ఇరుకుసందుల్లోనే చంద్ర బాబు సభలు పెట్టడం ఆయన తప్పు కాదా? ఆ వయసులో చంద్రబాబును కిలో మీటర్ల కొద్దీ నడిచేలా చేయడం సర్కార్ తప్పిదం కాదా? అంటే రెండు ప్రశ్నలకు అవుననే సమాధానం వస్తుంది. ఎవరి భాష్యం వారు చెప్పుకుంటున్నారు. ఎదుటి వారిదే తప్పు అంటూ ఇరు వర్గాలు ఒకరిపై ఒకరు ఆరోపించుకుంటుండటం పరిపాటిగా మారిపోయింది. చంద్రబాబు రోడ్ షోల సందర్భంగా కందుకూరులో తొక్కిసలాట జరిగి ఎనిమిది మంది మరణించారు. అలాగే గుంటూరు సభలో ముగ్గురు అమాయకులు మరణించారు. ఈ రెండు ఘటనల నేపథ్యంలో ప్రభుత్వం జీవో నెంబరు 1ను తీసుకు వచ్చింది. దానిపై అభ్యంతరం తెలుపుతూ న్యాయస్థానాలను విపక్షాలు ఆశ్రయించాయి. అయితే నిబంధనలను ఉల్లంఘించి చంద్రబాబు రోడ్డుపైన, ఇరుకుసందుల్లో సభలను పెట్టడం ఎందుకు? ఆయన బహిరంగ సభలను విశాలమైన మైదానంలో ఏర్పాటు చేసుకుంటే పోలీసులు అభ్యంతరం పెట్టరు. ఆ విషయం తెలిసినా తనను అడ్డుకుంటే సానుభూతి వస్తుందన్న కారణంతోనే చంద్రబాబు ఇరుకుసందుల్లో సభలను పెడుతున్నారని అధికార పార్టీ ఆరోపిస్తుంది. అయితే చంద్రబాబు మాత్రం పోలీసులు అనవసర ఆంక్షలు విధిస్తున్నారని, స్వచ్ఛందంగా జనం తమ సభలకు తరలి వస్తుంటే ఓర్వలేక అడ్డుకునే ప్రయత్నం పోలీసుల ద్వారా ఈ ప్రభుత్వం చేస్తుందని టీడీపీ నేతలు ఆరోపిస్తున్నారు. రహదారిలో సభను ఏర్పాటు చేసి సవాలు విసురుతూ రెచ్చగొట్టేలా చంద్రబాబు వ్యవహరించడం సరికాదన్న వాదనలూ లేకపోలేదు. చంద్రబాబు రోడ్ షోకు మాత్రమే తాము అనుమతిచ్చామని, కావాలని రోడ్డుపై సభను పెట్టి పోలీసులకు, ప్రభుత్వానికి సవాల్ విసిరారని, తమపై కార్యకర్తలు దాడి చేశారంటూ పోలీసులు ఆరోపిస్తున్నారు. ఏదైనా రెండు చేతులు కలిస్తేనే చప్పట్లు. తప్పు ఇద్దరి వైపు ఉంది. నిబంధనలను పాటించడం మాజీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ధర్మం. అదే సమయంలో సంయమనం పాటించడం పోలీసుల విధి. పోలీసులే రోడ్డు మీద బైఠాయించి ఆయన వయసును కూడా చూడకుండా కిలో మీటర్ల కొద్ది నడిపించడం కూడా భావ్యం కాదు. అందుకే చంద్రబాబు ప్రతి పర్యటన ఇక టెన్షన్ గానే సాగుతుంది. సెక్షన్ 30 అమలులో ఉందని చెబుతున్నా చంద్రబాబు వినలేదని పోలీసులు అంటున్నారు. ముందుగానే అనుమతి తీసుకున్నామని టీడీపీ చెబుతుంది. చంద్రబాబు తూర్పు గోదావరి జిల్లాలో మూడు రోజుల పాటు పర్యటించారు. జగ్గంపేట, పెద్దాపురంలో రాని పరిస్థితి అనపర్తిలోనే ఎందుకు వచ్చిందన్న ప్రశ్న కూడా తలెత్తుంది. మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్ చెప్పినట్లుగా చంద్రబాబును ఎంత నిలువరించే ప్రయత్నం చేస్తే వైసీపీకి అంత నష్టం జరుగుతుందన్న ఆయన వ్యాఖ్యలను కొట్టిపారేయలేం. అలాగని చంద్రబాబు ప్రతి పర్యటనలో ఇలాగే నిబంధనలు గాలికొదిలి ప్రయత్నించి పోలీసులు అడ్డుకున్నారని యాగీ చేయడాన్ని కూడా ప్రజలు హర్షించారన్నది అంతే వాస్తవం.

## ఆదానీకి నెలలో 70 బిలియన్ డాలర్ల మోసం

**ముంబై :**

భారత పారిశ్రామికవేత్త.. ప్రపంచంలోనే నెంబర్ 3 కుబేరునిగా ఎదిగిన గౌతమ్ అదానీ ఎంత వేగంగా ఆ స్థాయికి చేరుకున్నారో అంతే వేగంగా పడిపోయారు. నెల రోజుల్లో మారిపోయిన పరిణామాలతో ఆయన సంపద సగానికిపైగానే పడిపోయింది. నెల క్రితం 120 బిలియన్ల డాలర్లు ఉన్న ఆయన నెట్ వర్త్ .. ఇప్పుడు 50 బిలియన్ల డాలర్ల లోపు పడిపోయింది. అమెరికాకు చెందిన హిండెన్‌బర్గ్ రీసర్చ్ ఇచ్చిన నివేదికతో అదానీ ఆస్తులన్నీ కుదేలయ్యాయి. ప్రస్తుతం ఆయన ఆస్తి విలువ కేవలం 49.1 బిలియన్ల డాలర్లు అని బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ డేటా వెల్లడిస్తోంది. హిండెన్‌బర్గ్ ఇచ్చిన రిపోర్టుతో స్టాక్ మార్కెట్లలో అదానీ కంపెనీలు నష్టాల్ని చవిచూశాయి. దీంతో నెల క్రితం ప్రపంచంలోనే మూడవ సంపన్న వ్యక్తిగా ఉన్న అదానీ.. ఇప్పుడు ఆ జాబితాలో చాలా కిందకు పడిపోయారు. అదానీ గ్రూపులోని ఏడు ప్రధాన కంపెనీలు మార్కెట్లో దాదాపు 120 బిలియన్ల డాలర్లు కోల్పోయినట్లు తెలుస్తోంది. వలం నెలలోనే అదానీ సుమారు 71 బిలియన్ల డాలర్ల సంపదను కోల్పోయారు. టాప్ 500 మంది సంపన్న వ్యక్తుల జాబితాలో.. అతి త్వరగా సంపదను కోల్పోయిన వారిలో అదానీ నిలిచారు. బ్లూమ్‌బర్గ్ బిలియనీర్స్ ఇండెక్స్ జాబితా ప్రకారం అదానీ అత్యంత వేగంగా తన సంపదను కోల్పోయారు. అదానీ గ్రూప్ గ్రాస్ అప్పులు 2021?22 ఆర్థిక సంవత్సరం ముగిసేనాటికి రూ.2,20, 584 కోట్లకు పెరిగినట్లుగా మార్కెట్ వర్గాలు చెబుతున్నారు. ఇందులో సుమారు రూ. 81 వేల కోట్లు దేశ బ్యాంకులు ఇచ్చాయి. బ్రోకరేజి కంపెనీ జెఫ్రీస్ రిపోర్ట్ ప్రకారం, ఈ అప్పుల్లో 70 శాతం వాటా ప్రభుత్వ బ్యాంకుల నుంచి ఉండగా, ప్రైవేట్ బ్యాంకుల నుంచి 30 శాతం ఉంది. ఈ అప్పులకు సెక్యూరిటీగా అదానీ గ్రూప్‌కు చెందిన ఆస్తులు, షేర్లు, క్యాష్ ఫ్లోస్, బాండ్లు ఉన్నాయి. అందువలన అదానీ గ్రూప్ అప్పులను చెల్లించడంలో డీఫాల్ట్ అయినా, బ్యాంకులు ఈ గ్రూప్ ఆస్తులను టేకోవర్ చేసే అవకాశం ఉంది. మరోవైపు అదానీ గ్రూప్ అప్పుల్లో మెజార్టీ భాగం ఫారిన్ బ్యాంకులు, బాండ్ల ద్వారా వచ్చినవే ఉన్నాయి. ఫారిన్ బ్యాంకులు అదానీ గ్రూప్‌కు రూ.54 వేల కోట్ల అప్పులిచ్చాయని, మరో రూ.లక్ష కోట్లకు పైగా అప్పును బాండ్ల ద్వారా సేకరించిందని ఎనలిస్టులు పేర్కొన్నారు. కాగా, అదానీ గ్రూప్ ఇష్యూ చేసిన బాండ్లలో ఎల్ఐసీ, ఎస్‌బీఐ, పీఎన్‌బీ, కెనరా బ్యాంక్, ఓఎన్‌జీసీ, ఐఓసీ, ఎన్‌పీఎస్ వంటి సంస్థలే ఎక్కువగా ఇన్వెస్ట్ చేశాయి. మరోవైపు ఎల్ఐసీ లాంటి డీఐఐలు అదానీ గ్రూప్ కంపెనీల షేర్లలో భారీగా ఇన్వెస్ట్ చేశాయి. స్టాక్ మార్కెట్లలో అదానీ కంపెనీల షేర్లు పడిపోతూనే ఉన్నాయి. ఇంకా పరిస్థితి మెరుగుపడలేదు. దీంతో అదానీ ఎప్పుడు కోలుకుంటారా అన్నదానిపై మార్కెట్ వర్గాలకూ స్పష్టత లేకుండా పోయింది.

## గ్రంథాలయంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం

**పత్తికొండ**



పత్తికొండ శాఖ గ్రంథాలయంలో అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవం గ్రంథాలయ అధికారి ఎస్ రాంకుమార్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమానికి ఎంపీపీ స్కూల్ మండపేట స్కూల్ హెడ్మాస్టర్ ఖాసీం సాహెబ్ తెలుగు తల్లి చిత్రపటానికి పూలమాల వేశారు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కొంతమంది తల్లిదండ్రులు ఆంగ్లంలో చదవకపోతే ఎదగలేమనే భ్రమలో ఉన్నారని భారత్లో అత్యున్నత స్థానంలో ఉన్నవారు మాతృభాషల విద్యను అభ్యసించిన వారే అన్నారు ఆంగ్ల భాష నేర్చుకోవడం తప్పులేదు. విద్యాబోధన మాత్రం మాతృభాషలో జరిగినప్పుడే విద్యార్థులు ఆత్మవిశ్వాసం పెరుగుతుందన్నారు ఈ కార్యక్రమంలో పాఠకులు విద్యార్థిని విద్యార్థులు రామ్ కుమార్ గ్రంథాల అధికారి శాఖ గ్రంథాలయం పాల్గొన్నారు.

## ధాన్యం బకాయిలు కోసం రోడ్డెక్కిన అన్నదాతలు

### రైతు సంఘం ఆధ్వర్యంలో కొత్తూరు లో రైతులు ధర్నా

**పెదపాడు (కొత్తూరు) :**

రైతులకు,కౌలు రైతులకు ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేస్తూ ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం ఆధ్వర్యంలో పెదపాడు మండలం కొత్తూరు రైతు భరోసా కేంద్రం ముందు మంగళవారం రైతులు,కౌలు రైతులు ధర్నా నిర్వహించారు.

రైతులకు ధాన్యం బకాయిలు వెంటనే చెల్లించాలి, రైతుల పట్ల ప్రభుత్వ నిర్లక్ష్య వైఖరి నశించాలి అంటూ నినాదాలు చేశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ మాట్లాడుతూ రైతులు,కౌలు రైతులు రైతు భరోసా కేంద్రాల్లో ధాన్యం అమ్మి 40 రోజులు గడుస్తున్నా ధాన్యం సొమ్ములు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. అప్పులు చేసి పెట్టుబడి పెట్టి పంట పండించి అమ్మితే ధాన్యం సొమ్ములు చెల్లించకపోవడం వలన అప్పులకు వడ్డీలు పెరిగిపోయి అన్నదాతల ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. జనవరి 9 తర్వాత రైతులకు ధాన్యం సొమ్ములు చెల్లించలేదన్నారు. కొత్తూరు ఆర్ బి కే పరిధిలో సుమారుగా రూ.3 కోట్లు, కొత్త ముప్పరు ఆర్ బి కే పరిధిలో సుమారుగా రూ.4 కోట్లు ధాన్యం బకాయిలు చెల్లించాల్సిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి రైతులకు,కౌలు రైతులకు ధాన్యం బకాయి సొమ్ములు వడ్డీతో చెల్లించి ఆదుకోవాలని కోరారు. లేనిపక్షంలో ఆందోళనలు తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు.
ఈ కార్యక్రమంలో పెద్ది బోయిన కాశీ విశ్వనాథం, పల్లపోతు శ్రీనివాసరావు, పల్లపోతు రెడ్డియ్య, కన్నెగంటి పూర్ణచంద్రావు,చెన్ను బోయిన దుర్గారావు, దన్నే నాగేంద్రరావు,శనగల సత్యనారాయణ, కడిమి రాజు, చెడుగొండి సూర్యనారాయణ,కవ్వూరి రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

## యువకుడి దారుణ హత్య

**కడప**

వేంపల్లె పట్టణ సమీపంలోని పాములూరు గుట్ట సమీపంలో నాగల కట్ట వద్ద వేంపల్లె కు చెందిన విజయ్ కుమార్ అనే యువకుడు హత్యకు గురయ్యాడు. గుర్తుతెలియని వ్యక్తులు హత్య చేసి పెట్రోల్ పోసి నిప్పు పెట్టారు. హత్య జరిగిన అనవాలు సంఘం స్థలంలో పోలీసులు గుర్తించారు. హత్య జరిగిన ప్రదేశాన్ని వేంపల్లె సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై తిరుపాల్ నాయక్ క్షుణ్ణంగా పరిశీలించారు.

## దాడిని ఖండించిన సిపిఐ రామకృష్ణ

**విజయవాడ**

గన్నవరంలో టిడిపి కార్యాలయంపై వైసీపీ వర్గీయుల దాడిని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె రామకృష్ణ ఖండించారు. ఏపీలో వైసిపి ప్రతిపక్ష పార్టీలపై దాడులు, బెదిరింపులు, విధ్వంసాలకు తెగబడుతోంది. గన్నవరంలో విధ్వంసానికి పాల్పడిన వైసిపి శ్రేణులను వదిలేసి, టిడిపి వారిని పోలీసులు అరెస్టులు చేయటం దుర్మార్గం. పోలీసులు స్వతంత్ర ప్రతిపత్తిని వదిలి, అధికార వైసిపికి అనుకూలంగా వ్యవహరించడం తగదు. రాజకీయాల్లో భౌతిక దాడులను ప్రజాతంత్ర వాదులంతా ఖండించాలని అన్నారు.

## టీటీడీపీ రాస్తారోకో

**సూర్యాపేట**

సూర్యాపేట జిల్లా కోదాడ మండలం నల్లబండగూడెం చెక్పోస్ట్ తెలంగాణ-ఆంధ్ర సరిహద్దు విజయవాడ- హైదరాబాద్ జాతీయ రహదారిపై తెలంగాణ తెలుగుదేశం పార్టీ నాయకులు రాస్తారోకోకు దిగారు. ఆంధ్రప్రదేశ్ టీడీపీ అధికార ప్రతినిధి పట్టాభి అరెస్టుకు నిరసనగా ఆందోళనకు దిగారు. పట్టాభిని విడుదల చేయాలని డిమాండ్ చేసారు. ఈ నేపథ్యంలో జాతీయ రహదాటిపై కిలోమీటర్ మేర ట్రాఫిక్ నిలిచిపోయింది

## మూర్ఖులకు సమాధానాలు చెప్పను

**నందిగామ**

మూర్ఖులకు సమాధానాలు చెప్పనని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్ మోహన్ రావు అన్నారు. నందిగామలో రోడ్లు బాగుపడితే మొండితోక బ్రదర్స్ కు మంచి పేరు వస్తుందనే ఈర్షతోనే తెలుగుదేశం పార్టీ వాళ్లు ఆరోపణలు చేస్తున్నారు. నిద్ర గన్నేరు చెట్లు దేనికి పనికి వస్తాయో ప్రజలందరికీ తెలుసని అన్నారు. రోడ్లు వెడల్పు చేస్తుంటే ..ఆ విషయాన్ని - అభివృద్ధిని పక్కదారి పట్టించడానికే ..ఈ చెట్లపై అవినీతి అని తెలుగుదేశం పార్టీ డ్రామ చేస్తోందని అన్నారు.
తెలుగుదేశం పార్టీకి కోర్టులకు వెళ్లి స్టేలు తీసుకురావటమే పని. గాంధీ సెంటర్ నుండి చందర్లపాడు వెళ్లే రోడ్డు అభివృద్ధి పనులను ఆపటానికి తెలుగుదేశం పార్టీ కుట్రలు చేస్తుందని అయన అరోపించారు.

## గంజాయి పై పోలీసుల ఉక్కు పాదం

**విశాఖపట్నం**

విశాఖ సిటీ పోలీసులు , సెబ్ పోలీసు లు సంయుక్తంగా 338 కేసుల్లో 6459 కిలోల గంజాయి స్వాధీనం చేసుకున్న ట్టు నగర పోలీసు కమిషనర్ శ్రీకాంత్ వెల్లడించారు. విశాఖపై కొందరు పని కట్టుకుని తప్పుడు ప్రచారం చేస్తున్నా రని, అందుకే ఎప్పుడెప్పుడు. ఎక్కడ క్కడ గంజాయిని స్వాధీనం చేసుకు న్నామో, పోలీసులు, సెబ్ అధికారులు ఎంత అలెర్టుగా ఉన్నారో చెప్పడానికి ఈ సమావేశం ఏర్పాటు చేశామన్నా రు. గత ఏడాది జనవరి నుంచి ఈ ఏడాది జనవరి 31వ తేదీ వరకు 852 మంది నిందితులను అరెస్టు చేసినట్టు చెప్పారు. ఒడిశా రాష్ట్రంలోని కోరాపుట్ గంజాయికి ప్రధాన వనరుగా ఉందని, అక్కడ నుంచి విశాఖ నగరం మీదుగా రవాణా చేస్తున్న గంజాయిని స్వాధీనం చేసుకున్నామన్నారు. 77 కేసుల్లో 4604 కిలోలు స్వాధీనం చేసుకున్నా మన్నారు. స్వాధీనం చేసుకున్న మొత్తం 6459 కిలోల గంజాయిలో 2880 కిలోల గంజాయి ప్రధానంగా ఉత్తరప్రదేశ్, తమిళనాడు, రాజస్థాన్. ఢిల్లీ. బీహార్. మధ్యప్రదేశ్, పశ్చిమ బెంగాల్, కర్ణా టక , తెలంగాణలకు రాష్ట్రాలకు రవాణా అవుతోందని సీపీ చెప్పారు.

## బైరి ఇందిరకు ఘన నివాళి...

**జగిత్యాల**

ప్రముఖ రచయిత్రి, ఉపాధ్యాయురాలు బైరి ఇందిర మృతి సాహితీ రంగానికి తీరని లోటు అని ఆమె రచనలు ముందు తరాలకు ఆదర్శమని, ప్రకృతి, సామాజిక అంశాలపై సందించ్చిన రచనలు ప్రశంసనీయమని కళాశ్రీ అధినేత గుండేటి రాజు అన్నారు. మంగళవారం స్థానిక దేవిశ్రీ గార్డెన్స్ లో జగిత్యాల కు చెందిన కళాశ్రీ సాహితీ వేదిక ఆధ్వర్యంలో నిర్వహించిన బైరి ఇందిర సంతాప సమావేశంలో ఆమె చిత్ర పటానికి సాహితీవేత్తలు పూల మాలలు వేసి, రెండు నిమిషాలు మౌనం వహించి ఘన నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కళాశ్రీ అధినేత గుండేటి రాజు, కవయిత్రలు మద్దెల సరోజన, అయిత అనిత , ఉజగిరి జమున, వంగ గీతారెడ్డి, లక్కారాజు శ్రీలక్ష్మి, ములస్థం లావణ్య, కల్లపెల్లి సరళ, మాడిశెట్టి శ్రీనివాస్, ఓదెల గంగాధర్, డాక్టర్ శ్యామ్ సుందర్, రుద్ర మాణిక్యం, మల్లారపు రాజు, మద్దెల ప్రభాకర్ పాల్గొన్నారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

# మరో వివాదంలో ఏయూ రిజిస్ట్రార్

**విశాఖపట్టణం:**

విశాఖ ఆంధ్ర యూనివర్సిటీ యాజమాన్యంతో వైసీపీ నేతల సమావేశం అయ్యారు. ఏయూ వీసీ ప్రసాద్ రెడ్డి, రిజిస్ట్రార్ వైసీపీ నేతలతో హోటల్‌లో సమావేశం అయ్యారు. ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైసీపీ అభ్యర్థిని బలపర్చాలంటూ ప్రచారం చేయాలని వైసీపీ నేతలు కోరారు. ఈ సమావేశంలో వైవీ సుబ్బారెడ్డి, వైసీపీ నేతలు పాల్గొన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికల కోడ్ ఉల్లంఘించారని హోటల్ వద్ద సీపీఎం నేతలు నిరసన చేపట్టారు. సీపీఎం శ్రేణులను పోలీసులు అడ్డుకున్నారు. నిరసన కారులను అరెస్ట్ చేశారు. శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం పట్టభద్రుల నియోజకవర్గానికి మార్చి 13న ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలో ఆంధ్ర యూనివర్సిటీ వైస్‌ఛాన్సలర్ పీవీజీడీ ప్రసాద్ రెడ్డి, రిజిస్ట్రార్ వి.కృష్ణమోహన్ ఆదివారం నాడు పోలీస్ పహారాలో దసపల్లా హోటల్ లో వైఎస్ఆర్సీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్‌కి మద్దతుగా సమావేశం ఏర్పాటుచేశారు. ప్రైవేట్ విద్యాసంస్థల యాజమాన్యాలతో ఏయూ వీసీ, రిజిస్ట్రార్ సమావేశం నిర్వహించారు. బాధ్యత గల పదవుల్లో ఉండి రాజ్యాంగ నిబంధనలకు విరుద్ధంగా సమావేశాలు ఏర్పాటు చేయడం సరికాదని సీఐటీయూ నేతలు ఆరోపించారు. ఎన్నికల కోడ్ ను ధిక్కరించడమేనని విమర్శించారు. వీసీ, రిజిస్ట్రార్ పై తక్షణమే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ జిల్లా కమిటీ రాష్ట్ర ఎన్నికల కమిషన్‌ను కోరింది. సమావేశం గురించి తెలుసుకున్న ప్రజాసంఘాల నాయకులు, జిల్లా ఆర్‌డీఓ, డీఆర్‌ఓలకు సమాచారం అందించామని సీఐటీయూ తెలిపింది. అధికారులకు సమాచారం ఇవ్వడంతో వారు వస్తామని తెలపడంతో అక్కడకు చేరుకున్న సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి కుమార్, జిల్లా నాయకులు సుబ్బారావు, చంద్రశేఖర్, విద్యా?ర్థి, యువజన సంఘం నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టులు చేశారని ఆరోపించారు. అధికార పదవులో ఉండి ఎన్నికల కోడ్ ఉల్లంఘించిన ఏయూ వీసీ, రిజిస్ట్రార్‌లకు పోలీసులు రక్షణగా ఉండటం అధికార దుర్వినియోగమే అవుతుందన్నారు. ఎమ్మెల్సీ ఎన్నికలలో ఇప్పటికే వైసీపీ తన సచివాలయ సిబ్బందిని, వాలంటీర్లను, ఆర్‌పీలను వినియోగిస్తున్నా ఎన్నికల కమిషన్ ఎటువంటి చర్యలు తీసుకోకపోవడం సరైంది కాదని సీఐటీయూ మండిపడింది. వీరందర్నీ ఎన్నికల కమిషన్ పరిధిలోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఏయూ వీసీ, రిజిస్ట్రార్ చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సీఐటీయూ డిమాండ్ చేసింది. వైసీపీ అభ్యర్థి నామినేషన్ తిరస్కరించాలని కోరింది. ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎన్నికలపై ఉమ్మడి ఉత్తరాంధ్ర ఎమ్మెల్యేలతో ప్రాంతీయ సమన్వయకర్త వైవీ సుబ్బారెడ్డి సమావేశం అయ్యారు. ఈ సమావేశంలో ఉత్తరాంధ్ర మంత్రులు బొత్స సత్యనారాయణ, ధర్మాన ప్రసాదరావు, స్పీకర్ తమ్మినేని సీతారాం, బూడి ముత్యాల నాయుడు పాల్గొ?న్నారు. ఉత్తరాంధ్ర పట్టభద్రులు వైసీపీ ఎమ్మెల్సీ అభ్యర్థి సీతం రాజు సుధాకర్ ను గెలిపించాలని పార్టీ నాయకులకు వైవీ సుబ్బారెడ్డి సూచించారు. ఈ ఇరవై రోజులు పార్టీ నాయకులు నియోజక వర్గాల్లో ఓటర్లను కలిసి మెజార్టీ సాధించే దిశలో పనిచేయాలన్నారు. విశాఖ, శ్రీకాకుళం, విజయనగరం జిల్లాల్లోని కాలేజ్‌లన్నీ ఏయూ కిందకే వస్తాయి. అందుకే ఆయా జిల్లాల్లోని ప్రైవేట్ కాలేజ్‌ల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి.. వైసీపీకి ఓట్లు వేయాలని సూచించినట్లు వామపక్షాలు ఆరోపిస్తున్నాయి.. ఈ అంశంపై ఇప్పటికే ఎన్నికల సంఘానికి ఫిర్యాదు కూడా చేశాయి. వెంటనే వీసీ ప్రసాదరెడ్డిని విధుల్లోంచి తప్పించాలని డిమాండ్ చేశాయి. అయితే ఈ ఆరోపణలను వైసీపీ ఖండిస్తోంది. చేతకాని వాళ్లే ఇలాంటి ఫిర్యాదులు చేస్తారని ఆరోపించారు మంత్రి బొత్స. ఎక్కడా నిబంధనలను ఉల్లంఘించలేదని స్పష్టం చేశారు. ఇదిలాఉంటే.. వీసీని తప్పించాలంటూ విశాఖ కలెక్టరేట్ ఎదుట విద్యార్థి సంఘాలు ఆందోళన చేపట్టాయి.

# యూ ట్యూబ్ లో చూసి... నోట్లు తయారు చేసి

**హైదరాబాద్ :**

పైసా కోసం అడ్డదారులు తొక్కేవారు అడుగడుగునా పుట్టుకొస్తున్నారు. ఏకంగా కరెన్సీనే.. నకిలీవి పుట్టించి దందాకు తెగబడుతున్నారు. హైదరాబాద్ పాతబస్తీలోనూ ఇలాంటి ఘరానా మోసమే వెలుగులోకి వచ్చింది. పైసా.. కోసం అడ్డదారులు తొక్కేవారు అడుగడుగునా పుట్టుకొస్తున్నారు. ఏకంగా కరెన్సీనే.. నకిలీవి పుట్టించి దందాకు తెగబడుతున్నారు. హైదరాబాద్ పాతబస్తీలోనూ ఇలాంటి ఘరానా మోసమే వెలుగులోకి వచ్చింది. ఈజీ మనీ కోసం.. నీచ్ కమీనే పనులు చేస్తూ అడ్డంగా బుక్ అవుతుంటారు కేటుగాళ్లు. యూట్యూబ్ వీడియోలు చూసి.. నకిలీ కరెన్సీని ముద్రిస్తున్న గ్యాంగ్ ఆటకట్టించారు పోలీసులు. నిజమైన కరెన్సీకి ఏమాత్రం తీసుపోని విధంగా నకిలీ కరెన్సీని తయారుచేస్తున్న ముఠాను చాంద్రాయణగుట్టలో సౌత్ జోన్ టాస్క్ ఫోర్స్ పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఓ మహిళతో పాటు మరో ముగ్గురిని అరెస్ట్ చేశారు. వారి దగ్గర నుంచి 27 లక్షల నకిలీ కరెన్సీ నోట్లను సీజ్ చేశారు. నకిలీ కరెన్సీతో పాటు కరెన్సీ తయారు చేయడానికి వాడే మెటీరియల్ కూడా ప్రస్తుతం పోలీసుల ఆధీనంలో ఉంది. నారాయణ పేట జిల్లా కొస్గికి చెందిన కస్తూరి రమేష్ బాబు.. ఈ ముఠాలో కీలకంగా ఉన్నట్టు పోలీసులు గుర్తించారు. రమేష్ బాబు.. ఓ సాదా సీదా కారు మెకానిక్. లాక్ డౌన్ కారణంగా ఆర్థికంగా కొన్ని ఇబ్బందులు ఎదుర్కొన్నాడు. సులభంగా డబ్బు సంపాదించడం ఎలా ఆలోచలనలో అతనికి తట్టిన తప్పుడు ఆలోచనే నకిలీ కరెన్సీ తయారీ. నకిలీ కరెన్సీ ఎలా తయారు చేయాలా అనేదానిపై యూట్యూబ్‌లో కొన్ని వీడియోలు చూశాడు. వెంటనే ఓ ల్యాప్‌టాప్, లామినేటర్, ప్రింటర్, కలర్ బాక్స్‌లతో పాటు మరికొన్ని యంత్రాలను కొనుగోలు చేశాడు. ఫేక్ కరెన్సీ చేయడం మొదలుపెట్టాడు. యదేచ్ఛగా చలామణీ చేస్తూ అక్రమ దందాకు తెరలేపాడు. అయితే గతేడాది సెప్టెంబర్‌లో గోపాలపురం పోలీసులు కేసు నమోదు చేశారు. రమేష్ బాబును అరెస్ట్ చేసి జైలుకు పంపారు. అంతటితో బుద్ధి తెచ్చుకుని ఆ నకిలీ దందా మానేస్తారని పోలీసులు భావించారు. కానీ సరికొత్త యవ్వారం జైలు నుంచే మొదలైంది. రమేష్ బాబు జైలులో ఉండగా, బహదూర్‌పురాలో హత్య కేసులో జైలు శిక్ష అనుభవిస్తున్న హసన్ బిన్ హమూద్ పరిచయం అయ్యాడు. వీళ్లిద్దరూ కలిసి నకిలీ కరెన్సీ చెలామణికి పక్కా స్కెచ్ వేశారుజైలు నుంచి విడుదలైన తర్వాత రమేష్‌బాబు, అతని కుటుంబం తాండూరుకు మకాం మార్చింది. తన సోదరి రామేశ్వరితో కలిసి నకిలీ కరెన్సీ నోట్ల తయారీకి ముడిసరుకును సేకరించాడు. అన్నీ సమకూరాక 500 నోట్ల కరెన్సీ ముద్రించడం ప్రారంభించాడు. ముద్రించిన నోట్లను నేరుగా గుజరాత్ పంపించేస్తున్నాడు. దీన్ని పసిగట్టిన గుజరాత్ పోలీసులు.. 2023 జనవరిలో అరెస్ట్ చేసి జ్యుడీషియల్ కస్టడీకి తరలించారు. రమేష్ బాబు లాకప్‌లో ఇరుక్కోవడంతో.. హసన్ బిన్‌ను రామేశ్వరి సంప్రదించింది. ఆ తర్వాత నకిలీ కరెన్సీ ముద్రణ మెటీరియల్‌ను చాంద్రాయణ గుట్టకు తరలించారు. అక్కడ మళ్లీ ఫేక్ కరెన్సీ తయారుచేయడం మొదలుపెట్టారు. ఈ సారి కూడా పోలీసులకు అడ్డంగా దొరికిపోయారు. వారిని అదుపులోకి తీసుకున్న పోలీసులు.. ఇప్పటి వరకూ ఎంత మొత్తంలో నకిలీ కరెన్సీని చలామణీ చేశారనేది ఎంక్వైరీ చేస్తున్నారు. మామూలుగా అయితే ఈ నోటును గుర్తించడం చాలా కష్టం. మెషీన్లతో లెక్క పెట్టినప్పుడు మాత్రమే వీటిని గుర్తించే అవకాశం ఉంటుంది. కూరగాయల మార్కెట్లు, చిన్న చిన్న చిల్లర కొట్లలో ఇలాంటి దొంగనోట్లు ఇస్తే.. వాటిని దాదాపుగా గుర్తుపట్టడం కష్టం. కాబట్టి అప్రమత్తంగా ఉండాలని నిపుణులు సూచిస్తున్నారు

# ఎయిర్ పోర్టు వరకు మెట్రో

**హైదరాబాద్ :**

భాగ్యనగరాన్ని విశ్వనగరంగా తీర్చిదిద్దేందుకు తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం దీర్ఘ కాలిక ప్రణాళికలను సిద్ధం చేస్తోంది. జంటనగరాలకు నలువైపులా విస్తరించేందుకు అవకాశం ఉండడంతో ప్రభుత్వ పరంగా మెరుగైన మౌలిక వసతులు కల్పించడంపై దృష్టి సారించింది. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపట్టిన హైదరాబాద్ ఎయిర్‌పోర్టు మెట్రో లైన్‌కు పొడిగింపుగా.. శంషాబాద్ ఔటర్ రింగు రోడ్డు వెంబడి తుక్కుగూడ ఓఆర్ఆర్(ఔటర్ రింగ్ రోడ్డు) ఇంటర్‌చేంజ్ వరకు మెట్రో మార్గం నిర్మాణంపై అధ్యయనం చేయనున్నారు. నగరానికి వెస్ట్ జోన్‌లో ఉన్న ఐటీ కారిడార్‌లో అభివృద్ధి జరిగినట్లే, సౌత్ జోన్‌గా ఉన్న శంషాబాద్, తుక్కుగూడ, మహేశ్వరం, ఆదిభట్ల ప్రాంతాల్లో క్రమంగా అభివృద్ధి చెందుతున్నాయి. అంతేకాక హర్డ్‌వేర్ పార్కు, ఈ–సిటీ, రంగారెడ్డి కలెక్టరేట్, ఫార్మాసిటీ, అమెజాన్ డేటా సెంటర్ వంటి సంస్థలు ఇటువైపే ఉండడంతో నగరం నుంచి మెట్రో మార్గం కల్పించడం ద్వారా భవిష్యత్ ప్రజా రవాణా అవసరాలు తీర్చే ప్రాజెక్టుగా మెట్రో మారనుంది. ఓఆర్ఆర్ చుట్టూ ఇప్పటికే రైల్వే మార్గం కోసం కావలసిన స్థలం అందుబాటులో ఉంది. ఈ క్రమంలో దాని నిర్మాణ పనులను చేపట్టడం సులభం అవడమే కాకుండా తక్కువ వ్యయంతోనే అంతర్జాతీయ ప్రమాణాలతో ప్రజా రవాణా వ్యవస్థను కోర్ సిటీ నుంచి అభివృద్ధి చెందుతున్న శివారు ప్రాంతాలకు తీసుకువచ్చేందుకు ఇది దోహదం చేస్తుంది. శంషాబాద్,తుక్కుగూడ,మహేశ్వరం, ఆదిభట్ల ప్రాంతాలను పరిగణలోకి తీసుకొని హైదరాబాద్ మెట్రో రైలు సంస్థ క్షేత్ర స్థాయిలో అధ్యయనం చేయనుంది. ప్రస్తుతం రాయదుర్గం నుంచి శంషాబాద్ ఎయిర్‌పోర్టు వరకు 31 కి.మీ మెట్రో మార్గాన్ని నిర్మిస్తుండగా.. అక్కడి నుంచి తుక్కుగూడ వరకు 15 కి.మీ దూరం ఉంది. ఈ దూరం పూర్తిగా ఓఆర్ఆర్ పరిధిలోనే ఉండడంతో ప్రాజెక్టు వ్యయంపైనా అంచనా వేయనున్నారు. మెట్రో ప్రయాణం అంటే పూర్తిగా కాలుష్య రహిత ప్రజా రవాణా వ్యవస్థ. దీనిని గ్రేటర్ వ్యాప్తంగా అమలు చేసేలా ప్రణాళికలు రూపొందిస్తున్నారు రాష్ట్రపాలకులు. ఇటీవల రాష్ట్ర ప్రభుత్వం ఈ–మొబిలిటీ వీక్ ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహించింది. భవిష్యత్‌లో కాలుష్య రహిత ఇంధన వినియోగంపై తమ భవిష్యత్‌ను స్పష్టం చేసింది. ఏకంగా 4 చోట్ల ఎలక్ట్రిక్ వాహనాలకు సంబంధించిన రకరకాల ఉత్పత్తుల తయారీకి పారిశ్రామిక కారిడార్‌లను సిద్ధం చేసింది. వేలాది కోట్ల పెట్టుబడులతో పలు కంపెనీల తమ కార్యకలాపాలను ఇప్పటికే ప్రారంభించాయి. వీటిలో ఈ–సిటీ ప్రాజెక్టు మహేశ్వరంలోనే ఉంది.

## రూట్ మ్యాప్ పరిశీలన

మెట్రో రూట్ మ్యాప్ ను పరిశీలించారు. మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి సహా పలువురు ఇంజినీర్లు... ఈ రూట్ లో ఎదురయ్యే సవాళ్లపై అధ్యయనం చేశారు. రాయదుర్గం స్టేషన్, నానక్ రామ్ గూడ జంక్షన్, మైండ్ స్పేస్ జంక్షన్ వద్ద అవకాశం ఉన్న నిర్మాణాలపై పరిశీలన జరిపారు. ఎయిర్ పోర్ట్ మెట్రో నిర్మాణంలో పలు సవాళ్లు దురవుతాయని.. సమగ్ర అధ్యయనం, పరిశీలనతో వాటిని అధిగమిస్తూ నిర్మాణాలు చేస్తామని మెట్రో ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. రాయదుర్గం స్టేషన్ – నానక్ రామ్ గూడ జంక్షన్ క్లిష్టమైన మార్గమన్న ఆయన... అత్యుత్తమైన ఇంజినీరింగ్ పరిష్కారం కోసం అధ్యయనం చేస్తున్నామని చెప్పారు. 21 మీటర్ల ఎత్తులో మైండ్ స్పేస్ జంక్షన్ దాటడం పెద్ద సవాల్ అని.... మైండ్ స్పేస్ జంక్షన్ లో అండర్ పాస్, మధ్య రోటరీ, పైన ఫ్లై ఓవర్ ఉన్నాయని పేర్కొన్నారు. మూడు అడ్డంకులు దాటేందుకు ప్రత్యేక స్పాన్ నిర్మాణం చేపట్టాల్సిన అవసరం ఉందని వివరించారు. ఎయిర్ పోర్ట్ మెట్రో పిల్లర్లను ఫ్లై ఓవర్ పిల్లర్లకు దూరంగా నిర్మించాలని పేర్కొన్నారు. రాయదుర్గం మెట్రో స్టేషన్ నుంచి శంషాబాద్ వరకు ఎయిర్ పోర్ట్ మెట్రోను... రూ. 6,250 కోట్ల వ్యయంతో రాష్ట్ర ప్రభుత్వమే నిర్మించనుంది. మొత్తం 31 కిలోమీటర్ల మేర మెట్రోరైలు రెండవ దశ పూర్తి కానుంది. మూడు సంవత్సరాల కాలంలో పూర్తి అయ్యే విధంగా ఏర్పాట్లు చేస్తున్నారు. మెట్రో నిర్మాణం పూర్తైతే హైదరాబాద్ నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి 26నిమిషాల్లోనే చేరుకోవచ్చు. ప్రయాణికులకు మెట్రో కారిడార్‌లోనే విమానాశ్రయ ప్రయాణాలకు చెక్ ఇన్ చేసుకోవచ్చు. తద్వారా విమానాశ్రయాల్లో రద్దీని కూడా గణనీయంగా తగ్గించవచ్చు. ఈ మార్గంలో అనేక అంతర్జాతీయ కంపెనీలు తమ కార్యాలయాలను నిర్మిస్తున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ నిధులతో నిర్మితమవుతున్న ఎయిర్ పోర్ట్ ఎక్స్ ప్రెస్ మెట్రో మూడేళ్లలో పూర్తి చేయాలని తెలంగాణ సర్కార్ లక్ష్యంగా నిర్దేశించుకుంది. మరో 31 కిలో మీటర్ల పనులపై కేంద్రానికి డీపీఆర్ సమర్పించామని.... బీహెచ్ఈఎల్ నుంచి లక్డీకాపూల్ 26 కిలోమీటర్లు...... నాగోల్ నుంచి ఎల్బీనగర్ 5 కిలోమీటర్లకు మెట్రో విస్తరణకు సంబంధించి డీపీఆర్ ఇచ్చామని తెలిపారు.

# శాంతి భద్రతలకు విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు

**గన్నవరం**

గన్నవరం నియోజకవర్గ పరిధిలో నిన్న జరిగిన టిడిపి వైసిపి శ్రేణులు మధ్య నెలకొన్న ఘర్షణల నేపథ్యంలో టిడిపి శ్రేణులు చలో గన్నవరం కార్యక్రమానికి పోలీసువారి అనుమతులు లేవని అన్నారు.

తెలుగు దేశం పార్టీ నాయకుడు పట్టాభి, విధులు నిర్వహిస్తున్న పోలీసులు మీద దాడికి పురి గొల్పడం బాధ్యతా రహితంగా వ్యాఖ్యలు చేయడం వల్ల శాంతిభద్రతల సమస్య ఉత్పన్నమైంది. దీనివల్ల విధులు నిర్వహిస్తున్న గన్నవరం సిఐ కనకారావు తలకు బలమైన గాయమైంది. పట్టాభి తొందరపాటు చర్యలు, రెచ్చగొట్టే వ్యాఖ్యలు వల్ల శాంతి భద్రతలకు విఘాతం కలిగింది. తెలుగు దేశం పార్టీ ఆఫీసు పై జరిగిన దాడి కి సంబంధించిన వీడియో ఫుటేజీలు పరిశీలిస్తున్నాం. సుమోటోగా రైటింగ్ కేసు నమోదు చేసి పోలీసులు దర్యాప్తు చేపట్టడం జరిగింది. చట్టాన్ని అతిక్రమించిన వారు ఎవరైనా చట్టరీత్యా చర్యలు తప్పవు. గన్నవరం పోలీస్ స్టేషన్ పరిసర ప్రాంతాల్లో సెక్షన్ 144, 30 పోలీస్ ఆక్ట్ అమల్లో ఉంది. ముందస్తు అనుమతి లేకుండా ఏ విధమైన సభలు, సమావేశాలు, నిరసన కార్యక్రమాలు మొదలగునవి నిర్వహించరాదు. గన్నవరం పరిసర ప్రాంతాలకు ఎవరు ప్రవేశించకుండా చెక్ పోస్టు, పికెట్స్ ఏర్పాటు చేయడం జరిగింది. చట్టాన్ని ఉల్లంఘించి ఎవరైనా అక్రమంగా ప్రవేశించాలని చూస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది. శాంతి భద్రతల పరిరక్షణ లో ప్రజలు, రాజకీయ పార్టీ శ్రేణులు సహకరించవలసినదిగా జిల్లా ఎస్పీ జాషువా కోరారు.

# బాలల హక్కులు కాపాడడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలి

**నాగర్ కర్నూల్**

బాలల హక్కులు కాపాడడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని గ్రామ సర్పంచి గుమ్మకొండ జంగమ్మ,అన్నారు. మంగళవారం దత్తరం గ్రామంలో గ్రామపంచాయతీలో బాలల హక్కుల పరిరక్షణ కమిటీ సమావేశం ముఖ్య అతిథిగా గ్రామ సర్పంచ్ గుమ్మకొండ జంగమ్మ పాల్గొని మాట్లాడుతూ పిల్లలందరూ విద్యలో కొనసాగేందుకు ప్రతి తల్లిదండ్రులు కృషి చేయాలని . బాలలపై ఎలాంటి అఘాయిత్యాలు జరగకుండా చూసుకోవాలని. బాలికలు విద్యలో రాణించేందుకు ప్రోత్సహించాలని. బడి బయట ఉన్న పిల్లలందరి పాఠశాలలో చేర్పించాలని .18 సంవత్సరాల లోపు బాలికలకు. 21 సంవత్సరాలలోపు బాలురకు బాల్య వివాహాలు చేయరాదని గ్రామంలో జరిగే ప్రతి వివాహము గ్రామపంచాయతీలో పేరు నమోదు చేయాలని, పుట్టిన ప్రతి శిశువు కు ఇరవై ఒక్క రోజులలోపు బర్త్ సర్టిఫికెట్లు తీసుకోవాలని సూచించారు. పిల్లలపై ఎవరు కూడా వివక్షత చూపరాదని పిల్లలను గౌరవించి వారి యొక్క బంగారు భవిష్యత్తు కొరకు ప్రతి ఒక్కరు కృషి చేయాలని కోరారు. గ్రామంలోని అంగన్వాడీ కేంద్రాలలో వచ్చే పౌష్టికాహారం గర్భిణీ స్త్రీలు బాలింతలు ప్రీస్కూల్ చిల్డ్రన్ తప్పనిసరిగా తీసుకోవాలని కోరారు. గ్రామంలోని పాఠశాల అభివృద్ధికి ప్రభుత్వ కృషి చేస్తుందని తెలిపారు. ప్రైవేటు పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాల ఉందని ప్రతి ఒక్కరు కూడా గ్రామంలోని పాఠశాలలో చదివించాలని కోరారు. ఐదవ తరగతి పైన ఉన్న బాల బాలికలు పై చదువుల కోసం ప్రభుత్వం కస్తూరిబా గాంధీ పాఠశాలలు. సోషల్ వెల్ఫేర్ హాస్టల్స్. రెసిడెన్షియల్ పాఠశాలలు. ఉన్నాయని .డ్రాప్ కాకుండా విద్యలో కొనసాగించేందుకు తల్లిదండ్రులు కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ పంచాయతీ కార్యదర్శి రాజేష్ రెడ్డి, ఎస్వీకే మండల కోఆర్డినేటర్ శ్రీనివాసులు. ఆర్గనైజర్ ప్రమీల. అంగన్వాడి టీచర్లు కళమ్మ. ప్రధానోపాధ్యాయులు నస్రీన్ బేగం ఎస్ ఎం సీ చేర్మెన్ సోమయ్య. బల్చంద్రి.కోటయ .సత్యనారి. మల్లేష్. నిరంజన్.తదితర.లు పాల్గొన్నారు.

# వరంగల్ లో బీఆర్ఎస్ గుండాల రాజ్యం

## టీపీసీసీ ఛీఫ్ రేవంత్ రెడ్డి

**హన్మకొండ**

ఉమ్మడి వరంగల్ జిల్లాలో గత తొమ్మిదేళ్లుగా బీఆరెస్ గూండాల రాజ్యం నడుస్తోంది. రౌడీ కార్యక్రమాలకు కథానాయకుడు వరంగల్ వెస్ట్ ఎమ్మెల్యే అని టీపీపీపీ ఛీఫ్ రేవంత్ రెడ్డి ఆరోపించారు. మంగళవారం నాడు అయన హన్మకొండ లో మీడియాతో మాట్లాడారు. ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ అనుచరులు.. గంజాయి బానిసలు మత్తులో అరాచకాలకు పాల్పడుతున్నారు. అక్రమ సంపాదన కోసం ల్యాండ్,సాండ్, మైన్, అటెంప్ట్ రేప్ లలో కూడా బీఆరెస్ నేతలే ఉంటున్నారు. రాజకీయంగా వారికి నూకలు చెల్లాయనే ఎమ్మెల్యే ముఠా పవన్ ను చంపాలని ప్రయత్నిచాయి. తీవ్ర గాయాలపాలైన పవన్ చావు నుంచి తప్పించుకున్నాడు. చైతన్యవంతమైన వరంగల్ గడ్డపై ఇలాంటి దాడులు జరగడం దుర్మార్గమని అన్నారు. రాజకీయ ఒత్తిళ్లతో పోలీసులు తమ విధి నిర్వర్తించడం లేదు. ఎమ్మెల్యే ఆదేశాల మేరకే తనపై దాడి జరిగిందని పవన్ చెప్పాడు. స్థానిక ఎమ్మెల్యేపై, అతని ముఠా సభ్యులను అరెస్టు చేయాల్సిన పోలీసులు వారిని కాపాడుతున్నారని విమర్శించారు. పోలీసులు ఏ రాజకీయ పార్టీకి అనుబంధం కాదు. ఇప్పుడున్న ఎమ్మెల్యేలు శాశ్వతం కాదు. క్రిమినల్ చర్యలను ఉక్కు పాదంతో అణచాల్సిన పోలీసులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. దాడులు చేసి వీడియోలు చిత్రీకరించి బెదిరిస్తున్నా.. పోలీసులు నిస్సహాయంగా ఉండటం మంచిది కాదని అన్నారు. ఇది ఇద్దరు వ్యక్తుల మధ్య జరిగిన ఘటన కాదు.. మా యాత్రపైనే దాడి జరిగినట్టు. పర్యవేక్షించాల్సిన డీజీపీ వైపు నుంచి స్పందన లేదు. దీన్ని కాంగ్రెస్ శ్రేణులు సహించరు. కాంగ్రెస్ కార్యకర్తలపై దాడులకు నిరసనగా అన్ని మండల కేంద్రాల్లో కేసీఆర్ దిష్టిబొమ్మను దహనం చేయండి. అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం సమర్పించండి. ఈ నిరసన సెగ కేసీఆర్ కు తగలాలి. ఎమ్మెల్యే వినయ్ భాస్కర్, అతని గంజాయి ముఠాపై హత్యానేరం కింద అరెస్టు చేయాలి. ఈ మొత్తం ఘటనకు ఎమ్మెల్యే వినయ్ భాస్కర్ కారణమని ఆరోపించారు.

# భగత్ సింగ్ స్ఫూర్తితో ఉద్యమిస్తాం

కరీంనగర్

భారత స్వాతంత్ర సమరయోధుల్లో అగ్రసేనికి చెందినవారు భగత్ సింగ్ ఒకరిని ఉరికొయ్యకు తలవంచనీ ధీరత్వం,త్యాగానికి వెరవని వీరత్వం భగత్ సింగ్ సొంతమని వారి జీవిత స్ఫూర్తితో జిల్లాలో ప్రజా సమస్యలపై ఉద్యమిస్తామని సిపిఎం జిల్లా కార్యదర్శి మిల్కూరి వాసుదేవరెడ్డి అన్నారు. మంగళవారం రోజున ముకుంద లాల్ మిశ్రా భవన్లో కామ్రేడ్ ఎడ్ల రమేష్ అధ్యక్షతన రెడ్ బుక్ డే ను నిర్వహించారు. భగత్ సింగ్ జీవిత చరిత్ర పుస్తకాన్ని సామూహిక అధ్యయనం చేశారు. ఈ సందర్భంగా వాసుదేవ రెడ్డి మాట్లాడుతూ పరాయి పాలన విముక్తి కోసం తన జీవితాన్ని అంకితం చేసిన గొప్ప త్యాగశీలి ఆదర్శ ప్రాయుడు భగత్ సింగ్ అన్నారు. 1848 ఫిబ్రవరి 21న కార్ల్ మార్క్స్,ఎంగిల్స్ రచించిన కమ్యూనిస్టు మేనిఫెస్టో విడుదల చేశారని, అలాగే ఈరోజు ప్రపంచ భాషా దినోత్సవమని, లెఫ్ట్ రచయిత పన్సరే హత్య గావించబడ్డ రోజనీ ఈ సందర్భంగా రెడ్బుక్ డే ను వామపక్ష కమ్యూనిస్టు శ్రేణులుసామూహిక అధ్యయనం చేస్తున్నాయన్నారు. 1848 నుండి ప్రపంచవ్యాప్తంగా అనేక మార్పులు జరిగాయని సైన్స్ రంగం అభివృద్ధి చెందిందని, ఈ కాలంలో సామాజిక వర్గ పోరాటాలు జరిగాయన్నారు. అనేక పోరాటాల వల్ల సామాజిక మార్పులు వేగంగా వచ్చాయన్నారు. భావ ప్రకటన స్వేచ్ఛ రోజురోజుకు హరిస్తుంది. రచయితలపైన, జర్నలిస్టుల పైన మీడియా సంస్థల పైన, కవులు, కళాకారులు, సినిమాల పైన, కళారూపాల పైన, పాటల పైన, నటుల పైన కూడా దాడులు పెరిగాయన్నారు. దేశానికి అన్నం పెట్టే రైతన్నల మీద, మేధావుల మీద మత్తత శక్తులు దాడులు చేస్తుంది, అసలు రాజ్యమే మతోన్మాదానికి ఆసరాగా నిలుస్తుంది. గుప్పెడు మంది చేతిలో దేశ సంపద ఉందని అన్నారు. ఇప్పటికైనా మౌనాన్ని వీడి గొంతు విప్పాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ప్రస్తుత సమాజంలో శ్రమజీవికి గౌరవం లేదని,దోపిడీ ద్వారా సంపాదించిన వారికే గౌరవం దక్కుతుండడం ఆవేదన కలిగిస్తుందన్నారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

## మందుబాబుకు మేజిస్ట్రేట్ కోర్టు వినూత్న శిక్ష

**విశాఖపట్నం**

మందుబాబుకు వినూత్న శిక్ష విధించింది విశాఖలోని మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు ఇటీవల డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులో 52 మంది మందు బాబులను పోలీసులు అరెస్టు చేశారు. కోర్టులో హాజరుపరచగా వీరికి కోర్టు వినూత్న శిక్ష విధించింది. డ్రంక్ అండ్ డ్రైవ్లో అరెస్టు అయిన వారంతా కలిసి బీచ్లో ఉన్న వ్యర్థాలన్నీ ఏరివే యాలని కోర్టు ఆదేశించడంతో పోలీ సుల ఆధ్వర్యంలో మందుబాబులు బీచ్ క్లీన్ చేశారు.దీంతో మందుబాబు లుకు కోర్ట్ గట్టి షాకిచ్చినట్లైంది.మందు బాబులకు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు గడిచిన మూడురోజుల్లో డంకెన్ డ్రైవ్ లో పట్టుబడిన యాభై రెండు మంది మందు బాబులను బీచ్ ను శుభ్ర పరచాలని అన్యుహమైన తీర్పు వెలువరించడం ఇప్పుడు విశాఖలో అందరి దృష్టిని ఆకర్షించింది.

## బకాయి పన్నుల కోసం అధికారుల స్పెషల్ డ్రైవ్

**జంగారెడ్డిగూడెం**

బకాయి పన్నుల వసూళ్ల కోసం జంగారెడ్డిగూడెం పట్టణంలో మున్సిపల్ అధికారులు చేపట్టిన స్పెషల్ డ్రైవ్ యధావిధిగా కొనసాగుతుంది. ఈ క్రమంలోనే మంగళవారం అధికారులు పలు వ్యాపార సంస్థలకు వెళ్లి పన్ను వసూలు చేశారు. పన్ను చెల్లించని వారి ఆస్తులను జప్తు చేసారు. ఈ సందర్భంగా మున్సిపల్ కమిషనర్ పి భవాని ప్రసాద్ మాట్లాడుతూ బకాయి పన్ను వసూళ్లకు ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ చేపట్టామన్నారు. బకాయి పన్ను చెల్లించిన పక్షంలో సంబంధిత ఆస్తిని జప్తు చేస్తున్నామన్నారు. కావున ప్రజలు సకాలంలో పన్ను చెల్లించి పట్టణాభివృద్ధి సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ ఆర్ఐ సుబ్బారావు, టిపిఓ జగదీష్ , సానిటరీ ఇన్స్పెక్టర్ రమణమూర్తి , ఎఫ్ వన్ బాల మురళి తదితరులు పాల్గొన్నారు.

## పాలకుల నిర్లక్షానికి పసికందు బలి

**అల్లూరి**

పాలకుల నిర్లక్షానికి అభం శుభం తెలియని పసికందులు బలైపోతున్నారు.రహదారి సౌకర్యం లేకపోవ డం వారి పాలిట శాపంగా మారుతోం ది.అల్లూరి సీతారామరాజు జిల్లా అరకు నియోజకవర్గంలో గిరిజనులకు రవాణా సదుపాయం లేక విపత్కర పరిస్థితిలో ఆసుపత్రికి వెళ్లే అవకాశం లేక పుట్టుడు కష్టాలు ఎదుర్కొంటు న్నారు.దీంతో వారికి డోలిమూతలు తప్పడం లేదు.హుకుంపేట మండల పరిధి తీగలవలస పంచాయితీ పంస బంధ గ్రామం పీవీటీజీ గిరిజన మహిళ భాను ప్రసవ కోసం ఆసుపత్రికి వెళ్లలేని పరిస్థితి ఎదురైంది.దానికి కారణం సరైన మార్గం లేకపోవడం.దీంతో చేసేది లేక డోలి మోతతో 2 కిలోమీ టర్లు మేర తీగలవలస వరకు తరలిం చగా మార్గ మధ్యలో పరిస్థితి అదుపు తప్పంది.హుకుంపేట ప్రభుత్వ హాస్పి టల్ తరలించే సమయానికి ఆడ బిడ్డ జన్మించి అప్పటికే మృతి చెందిం ది.అయితే సకాలంలో అంబులెన్స్ లేకపోవడం పసికందు మృతికి కారణమైందని గ్రామస్థులు ఆవేదన చెందుతున్నారు.

## విశాఖ ఎంపిగా పోటీ చేస్తా

**విశాఖపట్నం**

తన రాజకీయ భవిష్యత్తుపై సీబీఐ మాజీ జేడీ లక్ష్మీనారాయణ స్పష్టతనిచ్చారు.వచ్చే ఎన్నికల్లో విశాఖపట్నం ఎంపీగా పోటీ చేయనున్నట్లు ప్రకటించారు. తన ఆలోచన విధానాన్ని ఇప్పటికే స్పష్టం చేశానన్నారు. ఏదైనా పార్టీ తన ఆలోచనా విధానం నచ్చి వస్తే వారితో చర్చలు నిర్వహించనున్నట్లు తెలిపారు. మన ఎన్నికల వ్యవస్థలో ఇండిపెండెంట్గా పోటీ చేసే అవకాశం ఉందన్నారు. తన రాజకీయ భవిష్యత్తును కాలమే నిర్ణయిస్తుందని లక్ష్మీనారాయణ చెప్పుకొచ్చారు.కాగా గత ఎన్నికల్లో జనసేన తరపున విశాఖ నుంచి ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన లక్ష్మీనారాయణ...వైసీపీ అభ్యర్థి ఎంవీవీ సత్యనారాయణ చేతిలో ఓడిపోయిన విషయం తెలిసిందే. ఆ తరువాత పవన్ పార్టీకి గుడ్బై చెప్పి సామాజిక సేవ చేయడం, రైతులకు అండగా నిలవడమే లక్ష్యంగా ముందుకెళతానని ప్రకటించారు. కానీ మళ్లీ ఎన్నికలు దగ్గర పడుతున్న తరుణంలో రాజకీయంగా అడుగువేయాలని దృష్టిసారించారు. అయితే ఈ సారి లక్ష్మీనారాయణ ఏ పార్టీ నుంచి బరిలోకి నిలుస్తారనేది చర్చనీయాంశంగా మారింది

## కేసీఆర్ చిత్రపటం దహనం

**హుస్నాబాద్**

సిద్దిపేట జిల్లాహుస్నాబాద్ అంబేద్కర్ చౌరస్తాలో నిన్నటి రోజు వరంగల్ లో యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు పవన్ పై జరిగిన దాడిని ఖండిస్తూ యూత్ కాంగ్రెస్ నాయకులు సీఎం కేసీఆర్ చిత్రపటాన్ని దహనం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్ రెడ్డి వరంగల్ లో చేస్తున్నటువంటి హత్ సే హాత్ జోడో కార్యక్రమానికి ప్రజల నుండి వస్తున్న స్పందనను ఓర్వలేక బిఆర్ఎస్ గుండాలు తమ యూత్ కాంగ్రెస్ అధ్యక్షుడు, నాయకులపై దాడి చేశారని ఆరోపించారు. తమ నాయకులపై బిఆర్ఎస్ గుండాల దాడిని తీవ్రంగా ఖండించారు.

# అమ్మపాలెం మహిళా సర్పంచ్ సంతకం ఫోర్జరీ

### ఎంపిడివోకు పిర్యాదు

**ఏలూరు**

ఏలూరుజిల్లా పెదవేగి మండలం అమ్మపాలెం పంచాయతీ మహిళా సర్పంచ్ సంతకం ఫోర్జరీ చేసి ఆ పంచాయతీ కార్యదర్శి. ((డ్రాయింగ్ అధికారి).ఔట్ సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్ తో చేతులు కలిపి 2 లక్షల రూపాయలు పంచాయతీ నిధులు స్వాహా చేసినట్టు తెలిసింది.ఈ వ్యవహారం పై సర్పంచ్ కార్యదర్శి పైన కంప్యూటర్ ఆపరేటర్ పై పెదవేగి ఎం పి డి ఓ రాజ్ మనోజ్ కి పిర్యాదు చేసినట్టు తెలిసింది.దీనిపై మెట్రో టి వి ఎం పి డి ఓ రాజ్ మనోజ్ ని మంగళవారం వివరణ కోరగా అమ్మపాలెం పంచాయతీలో కార్యదర్శి కిషోర్ .ఔట్ సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్ సర్పంచ్ సంతకాన్ని ఫోర్జరీ చేసి 2 లక్షల రూపాయలు పంచాయతీ నిధులు స్వాహా చేశారని సర్పంచ్ పిర్యాదు చేశారని ఎం పి డి ఓ రాజ్ మనోజ్ తెలిపారు.దీనిపై పూర్తి స్థాయి విచారణ చేయమని ఈ ఓ పి ఆర్ డి శ్రీనివాస్ ని ఆదేశించామని చెప్పారు.ఈ ఓ పి ఆర్ డి చేసిన విచారణ రిపోర్ట్ పై తగు చర్యల కొరకు జిల్లా పంచాయతీ అధికారికి విచారణ నివేదిక పంపుతామని ఎం పి డి ఓ రాజ్ మనోజ్ తెలిపారు.అయితే ఇదే ఔట్ సోర్సింగ్ కంప్యూటర్ ఆపరేటర్ పెదవేగి మండలంలో కొంతమంది కార్యదర్శుల కు కంప్యూటర్ ఆపరేటర్ గా ను మరొక కార్యదర్శికి మేనేజర్ గా పనిచేసి నకిలీ బిల్లులు తయారు చేసి కొట్లాది రూపాయలపంచాయతీ నిధులు కార్య దర్శులు తో చేతులు కలిపి పంచాయతీలలో ఆర్థిక నేరాలకు పాల్పడే కార్యదర్శుల ముఠాకు ఈ కంప్యూటర్ ఆపరేటర్ ప్రధాన సూత్రధారని పెదవేగి మండలం లోవిమర్శలున్నాయి.పెదవేగి మండలం తో పాటు ఇతర మండళాలలోకూడా ఈ కంప్యూటర్ ఆపరేటర్ తన నైపుణ్యత తో నుదులున్న పంచాయతీలలో కార్యదర్శులతో ఉన్న పాత పరిచయాల ను పెంచుకుని నకిలీ బిల్లుల తో పంచాయతీలను ఆర్థికంగా కుదేలు చేయడం లో మంచి నైపుణ్యత కలిగిన సైబర్ నేరగాడ ని పెదవేగి మండల పరిషత్ కార్యాలయంలో మంచి పేరు ప్రఖ్యాతులున్నట్టు సమాచారం. అమ్మపాలెం పంచాయతీలో ఫోర్జరీ సంతకం వ్యవహారం లో కంప్యూటర్ ఆపరేటర్ కి అధికారులనుండి.రాజకీయ నాయకుల నుండి ఎటువంటి ఇబ్బందులు కలిగించవద్దని ఆ కంప్యూటర్ ఆపరేటర్ నైపుణ్యత తో కోట్లు గడించిన ఒక కార్యదర్శి అధికార పార్టీ పెద్దలను.జిల్లా అధికారులను ఆదేశించినట్టు సమాచారం.అమ్మపాలెం ఫోర్జరీ సంతకం తో 2లక్షలు స్వాహా చేసిన కార్యదర్శి ఒక మాజీ పోలీస్ అధికారి బంధువు అని సమాచారం.ఈ వ్యవహారం రాజకీయ నాయకుల మధ్య హాట్ హాట్ గా చర్చలు సాగుతున్నట్టు సమాచారం.

# దాడులను తీవ్రంగా ఖండించిన టీడీపీ నేతలు

**పత్తికొండ**




పత్తికొండ నియోజకవర్గం రెవెన్యూ డివిజనల్ కేంద్రమైన పత్తికొండ పట్టణంలో గల తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. కార్యక్రమంలో పత్తికొండ నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ నాయకులు పాల్గొన్నారు. వైసిపి అరాచక పాలనను తెలుగుదేశం పార్టీ కార్యాలయం పై నాయకులపై దాడులను టిడిపి నాయకులు తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో జగన్ ప్రజాస్వామ్యం నడుస్తోందని, టిడిపి పార్టీ కార్యాలయాలపై దాడులు చేసి వారిపైనే కేసులు పెట్టడం దురదృష్టకరమని, ఇటువంటి విపత్కర పరిస్థితులు మనుపెన్నడూ జరగలేదని టిడిపి నాయకులు అన్నారు. ప్రజలు చైతన్య వంతులయ్యారని భవిష్యత్తులో జరిగే ఎన్నికలు తెలుగుదేశం పార్టీ అధికారంలోనికి వస్తుందని, ప్రస్తుతం దాడులకు పాల్పడిన వ్యక్తులపై కఠినమైన చర్యలు తీసుకుంటామని అన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివరెడ్డి, రాష్ట్ర టిఎన్టియుసి నాయకులు అశోక్ కుమార్, నరసింహులు కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు సాంబశివరెడ్డి, రాష్ట్ర టిఎన్టియుసి నాయకులు అశోక్ కుమార్, నరసింహులు యాదవ్, కర్నూల్ జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు రామా నాయుడు, టిడిపి సీనియర్ నాయకులు తిమ్మయ్య చౌదరి, మాజీ సర్పంచులు, శ్రీనివాసులు, తెలుగు మహిళా అధ్యక్షురాలు జానకమ్మ పాల్గొన్నారు.

# ఇంద్రపురి కమ్యూనిటీ హాల్ కు భూమి పూజ

**మెదక్**

మెదక్ పట్టణంలోని ఇంద్రపురి కాలనీలో కమ్యూనిటీ హాల్ కి సీఎం కేసీఆర్ రాజకీయ కార్యదర్శి, ఎమ్మెల్సీ శేరి సుభాష్ రెడ్డి భూమి పూజ చేశారు. ఎమ్మెల్సీ తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి రూ, 10 లక్షల రూపాయలను ఇంద్రపురి కమ్యూనిటీ హాల్ కి మంజూరు చేశారు. ఈ సందర్భంగా ఇంద్రపురి కాలనీ వద్ద మునిసిపల్ మాజీ చైర్మన్, ప్రస్తుత వైస్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, స్థానిక కౌన్సిలర్ మామిళ్ల అంజినేయులు, ఇంద్రపురి కాలనీ అధ్యక్షుడు గోపాల్ రావు లతో కలిసి సంబంధిత స్థలంలో కొబ్బరికాయ కొట్టి భూమి పూజ చేసి కమ్యూనిటీ హాల్ పనులను ప్రారంభించారు. ఈ సంధర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ ఇంద్రపురి కాలనీ శరవేగంగా అభివృద్ధి చెందుతున్నదని, అలాంటి కాలనీకి ఏదైనా కార్యక్రమాలు నిర్వహించుకోవడానికి కమ్యూనిటీ హాల్ లేక ఇబ్బందులు ఉన్నాయని కాలనీ పెద్దలు తన దృష్టికి తీసుకురాగా కమ్యూనిటీ హాల్ ను తన నియోజకవర్గ అభివృద్ధి నిధుల నుంచి మంజూరు చేశానని ఎమ్మెల్సీ తెలిపారు. భవిష్యత్తులో కూడా ఇంద్రపురి కాలనీ అభివృద్ధికి కృషి చేస్తానని ఎమ్మెల్సీ గారు హామీ ఇచ్చారు.

ఈ కార్యక్రమంలో జిల్లా రైతుబంధు అధ్యక్షుడు తడెపు సోములు, సర్పంచులు దేవా గౌడ్, మహిపాల్ రెడ్డి, యామి రెడ్డి, ఉప సర్పంచ్ అజయ్ గౌడ్, మాజీ కౌన్సిలర్ శేఖర్ గౌడ్, కాలనీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి జనార్దన్ రెడ్డి, కాలనీ ప్రముఖులు జైపాల్ రెడ్డి, నర్సింహారెడ్డి, హన్మంత్ రెడ్డి, సిద్దిరాములు, స్వామి, రాం రెడ్డి, ప్రతాప్ రెడ్డి, శ్రీనివాస్ రెడ్డి, వెంకట్ గౌడ్, జయరాములు, కృష్ణ, తదితరులు కూడా ఉన్నారు

# విద్యార్థుల భవిష్యత్‌కు సహకారం

**ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తాం**

**మున్సిపల్ చైర్పర్సన్ పుట్ట శైలజ**

**మంథని**



ఇచ్చిన మాటకు కట్టుబడి పనిచేస్తామని, విద్యార్థుల భవిష్యత్‌కు సహకారం ఎల్లప్పుడు అందిస్తం అని మంథని మున్సిపల్ చైర్పర్సన్ పుట్ట శైలజ అన్నారు. మంగళవారం మంథని ప్రభుత్వ బాలికల జూనియర్ కళాశాలలో మినరల్ వాటర్ ప్లాంట్‌కు పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్టు ద్వారా మరమ్మత్తులు చేయించి మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా పుట్ట శైలజ మాట్లాడుతూ గత కొద్ది రోజుల క్రితం కళాశాలలో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న పెద్దపల్లి జెడ్పీ చైర్మన్ పుట్ట మధుకర్ కు విద్యార్థులు ఇక్కడి సమస్యలు విన్నవించారని, ముఖ్యంగా తాగునీటి ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని చెప్పడంతో వెంటనే స్పందించిన ఆయన రెండు మూడు రోజుల్లో వాటర్ ప్లాంట్‌కు మరమ్మత్తులు చేయిస్తామని విద్యార్థులకు హమీ ఇచ్చారని తెలిపారు. కళాశాలలోని వాటర్ ప్లాంట్‌కు తన స్వంత ఖర్చులతో మరమ్మత్తులు చేయించి వినియోగంలోకి తీసుకువచ్చారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్‌కు బంగారు బాటలు వేసేందుకు తమవంతు పూర్తి సహకారం అందిస్తామన్నారు. ఇప్పటికే కళాశాలల్లోని పేద విద్యార్థుల ఆకలి తీర్చేలా ట్రస్టు ద్వారా మధ్యాహ్న బోజనం అందించడం జరుగుతుందని తెలిపారు. విద్యార్థులు మంచిగా చదువుకుని కన్నవారి కలలకు సాకారం చేకూర్చాలని ఆమె సూచించారు. అనంతరం పుట్ట లింగమ్మ చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో నిర్వహించే మధ్యాహ్న బోజన కార్యక్రమంలో పాల్గొని విద్యార్థులకు స్వయంగా బోజనం వడ్డించారు.

ఈ కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపల్ సయ్యద్ సలీం, అధ్యాపకులు ఝాన్సీ, రావుల తిరుమల్, నాగేష్, శశి, శ్రీదేవి లతోపాటు పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

## టర్కీలో మళ్లీ మరోసారి రెండు భారీ భూకంపాలు



**అంటక్యా (టర్కీ) :**

అసలే భారీ భూకంపంతో అల్లాడుతున్న టర్కీలో మళ్లీ మరోసారి రెండు భారీ భూకంపాలు సంభవించాయి. సోమవారం రాత్రి టర్కీలోని హటే ప్రావిన్స్‌లోని అంటక్యాలో భూకంపం సంభవించిందితాజా భూకంపం తీవ్రత రిక్టర్ స్కేలుపై 6.4 గా నమోదైందని శాస్త్రవేత్తలు చెప్పారు. ఈ భారీ భూకంపంప్రభావం వల్ల ముగ్గురు వ్యక్తులు మరణించగా, మరో 213 మందికి పైగా గాయపడ్డారని టర్కీ అంతర్గత మంత్రి సులేమాన్ సోయ్లును చెప్పారు.గత పక్షం రోజుల క్రితం టర్కీలో సంభవించిన వినాశకరమైన భూకంపం తర్వాత భవనాల శిథిలాల కింద బాధితుల ప్రాణాలను రక్షించడానికి టర్కీ ప్రభుత్వం రెండు ప్రావిన్స్‌లలో పెద్ద రెస్క్యూ, సెర్చ్ ఆపరేషన్‌లో నిమగ్నమై ఉంది. మరో వైపు సోమవారం టర్కీ-సిరియా సరిహద్దు ప్రాంతంలో మరో రెండు భూకంపాలు సంభవించాయని యూరోపియన్-మెడిటరేనియన్ సీస్మోలాజికల్ సెంటర్ వెల్లడించింది. దక్షిణ టర్కీలో సోమవారం సంభవించిన రెండు తాజా భూకంపాలపై యునైటెడ్ స్టేట్స్ తీవ్ర ఆందోళన చెందుతోందని జాతీయ భద్రతా సలహాదారు జేక్ సుల్లివన్ చెప్పారు. టర్కీకి పూర్తి మద్దతు ఇస్తామని ఆయన పేర్కొన్నారు.

## అనుమాన స్పద స్థితిలో యువకుడు మృతి

**బద్వేలు**

గోపవరం మండలం సోమశిల జలాశయం వెనుక జలాల్లో పొద్దుటూరు పట్టణం సంజీవ నగర్ చెందినచిన్ని రామాంజనేయులు 36 అనే యువకుడు అనుమానస్పద స్థితిలో మృతి చెందాడు నెల్లూరు జిల్లా సోమేశుల గ్రామానికి చెందిన ఒక చేపల వ్యాపారి రామాంజనేయులు ను 15 రోజుల క్రితం రామాంజనేయులు ను సోమేశుల జలాశయంలో ఆలివ్ వలలు లాగేందుకు తీసుకు రావడం జరిగిందిసోమేశుల బ్యాక్ వాటర్ లో ఎంతోకాలంగా అక్రమ చేపల వేట సాగుతుంది ఇది అందరికీ తెలిసిన బహిరంగ రహస్యమే ఆలివ్ వలలు వేసి చేపలు పడుతుంటారు బద్వేల్ లో అక్రమ చేపల వేట చేసేవారు పలువురు ఉన్నారు రామాంజనేయులు కూడా ఆలివ్ వలలు లాగేందుకు ఇక్కడికి రావడం జరిగింది తనకు ఇక్కడ పనిచేయడం ఇష్టం లేదని ఆదివారం సాయంత్రం అతని పిలిపించిన వ్యక్తికి చెప్పడం జరిగింది ఆ తరువాత ఏమైందో గాని సోమవారం సాయంత్రం బ్యాక్ వాటర్ లో రామాంజనేయులు శవమై కనిపించాడు అతని మృతదేహం ఒడ్డుకు కొట్టుకు రావడంతో స్థానికులు వీఆర్వో ఓబులేసుకు సమాచారం ఇచ్చారు వెంటనే బద్వేలు రూరల్ ఎస్సై చంద్రశేఖర్ కు సమాచారం రావడంతో ఆయన బోటు ద్వారా శవాన్ని బయటికి తీయించారు పోస్టుమార్టం నిమిత్తం రామాంజనేయులు మృతదేహాన్ని బద్వేలు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు పోలీసులు కేసు నమోదు చేశారు రామాంజనేయులు మృతి అనుమానస్పదంగా ఉందని స్థానికులు చెబుతున్నారు బ్యాక్ వాటర్ లో ఆలివ్ వలలతో ఎంతో కాలంగా అక్రమ చేపల వేట సాగుతుంది అక్రమ చేపలు వేటకు ఇప్పుడు ఒక వ్యక్తి బలి కావడం ప్రాధాన్యత సంతరించుకుంది

## విద్యార్థినులకు అవగాహనా సదస్సు

**డోన్**

పదో తరగతి విద్యార్థినులకు 2023 లో మార్చ్, ఏప్రిల్ జరిగే పబ్లిక్ పరీక్షలపైన అవగాహనా సదస్సు నిర్వహించడం జరిగింది, స్థానిక పట్టణంలో జిల్లా పరిషత్ బాలికల పాఠశాల లో ప్రధాన ఉపాధ్యాయురాలు మైమున్నిసా అధ్యక్షత వహించగా, డోన్ డివిజన్ డిప్యూటీ విద్యాధికారి క్రిష్టపర్ ముఖ్య అతిథిగా హాజరై అయన మాట్లాడుతూ విద్యార్థులకు పరీక్షలు అంటే భయం ఎందుకు, నిర్భయంగా ఉండి ఇష్ట పడి చదివి పరీక్షలు రాయాలి అన్నారు,అనంతరం కర్నూల్ నుంచి మరో ముఖ్య అతిథి గా హాజరైన ప్రభుత్వ డైట్ అధికారి విద్యార్థులకు సబ్జక్ట్స్ లలో సులభంగా మర్క్స్ వచ్చే విధంగా అవగాహనా కల్పించారు, అలాగే కర్నూల్ ప్రతిభ కోచింగ్ సెంటర్ అధినేత అరుణాచలం రెడ్డి విద్యార్థుల లెక్కలు సబ్జెక్టు విషయం సులభంగా ఎలా లెక్కలు చెయ్యాలి, మార్కులు వచ్చే విధంగా అవగాహనా కల్పించి, మంచి మార్కులు రావాలి అనీ తెలిపారు, ఈ కార్యక్రమం లో డిప్యూటీ సీసీ నాయక్, పాఠశాల టీచర్స్ , పదో తరగతి విద్యార్థినులు పాల్గొన్నారు..

## మార్చి 7న వాచిలు, మొబైల్ ఫోన్లు ఈ-వేలం

**తిరుపతి**

తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు ఇతర అనుబంధ ఆలయాలలో హుండీ ద్వారా భక్తులు కానుకగా సమర్పించిన వాచిలు , మొబైల్ ఫోన్లను మార్చి 7వ తేదీ రాష్ట్ర ప్రభుత్వ కొనుగోలు పోర్టల్ ద్వారా ఈ- వేలం వేయనున్నారు. ఇందులో టైటాన్, క్యాషియో, టైమెక్స్, ఆల్విన్, సొనాట, టైమ్‌వెల్, ఫాస్ట్‌ట్రాక్ కంపెనీల వాచి లున్నాయి . ఆదేవిధంగా వివో, నోకియా, కార్బన్, సాంసన్, మోటోరోలా, ఒప్పో కంపెనీల మొబైల్ ఫోన్లు వున్నాయి. కొత్తవి/ ఉపయోగించిన/ పాక్షికంగా దెబ్బతిన్న వాచిలు మొత్తం 22 లాట్లు, మొబైల్ ఫోన్లు 18 లాట్లు ఈ-వేలంలో ఉంచారు.

ప్రజా తపన
prajathapana.com
News that matters

# దేశ ఫార్మా రంగ రాజధానిగా హైదరాబాద్

## కన్హా శాంతి వనంలో ప్రారంభమైన ఇంటర్నేషనల్ బయోమి సదస్సు

## హాజరైన జాతీయ, అంతర్జాతీయ ఫార్మా నిపుణులు

**హైదరాబాద్**

తెలంగాణా రాష్ట్రం ఫార్మా రంగంలో దేశ రాజధానిగా మారిందని పలువురు అంతర్జాతీయ ఫార్మా నిపుణులు అభిప్రాయం వ్యక్తం చేశారు. మంగళవారం కన్హా శాంతివనం, శంషాబాద్ సమీపంలో జరిగిన ఇంటర్నేషనల్ బయోమి '2023 కాన్ఫరెన్స్ లో జాతీయ, అంతర్జాతీయ ఫార్మా నిపుణులు పాల్గొన్నారు. తెలంగాణ రాష్ట్ర గిరిజన గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో 3 రోజుల పాటు ఈ అంతర్జాతీయ సదస్సును ఏర్పాటు చేశారు. సోషల్ వెల్ఫేర్, ట్రైబల్ వెల్ఫేర్ రెసిడెన్షియల్ విద్యార్థుల కోసం వివిధ రంగాల్లో ప్రసిద్ధి చెందిన జాతీయ, అంతర్జాతీయ ప్రొఫెసర్ల తో అవగాహన సదస్సు నిర్వహించారు. ప్రారంభ సదస్సుకు సంస్థ సెక్రెటరీ రోనాల్డ్ రాస్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బయో, ఫార్మా రంగంలో ఎన్నో మార్పులు జరుగుతున్నాయని, వాటికి అనుగుణంగా నూతన పరిశోధనలు జరగాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఇటీవల కరోన లాంటి వైరస్ కారణంగా ప్రజలు తీవ్ర స్థాయిలో ఇబ్బందులు ఎదుర్కొన్నారు. దేశ ఆర్థిక వ్యవస్థకు విఘాతం కల్గింది. ఆ విపత్కర పరిస్థితుల్లో మన బయో, ఫార్మా రంగం ప్రపంచ మానవాళిని కాపాడింది. ఆ విధంగా విద్యార్థులు కూడా ఇప్పటి నుంచే నూతన పరిశోధనా అంశాలపై దృష్టి సారించాలని, సమాజానికి మనం ఎంతో సేవ చేయాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారు. ఈ కాన్ఫరెన్స్ లో అమెరికా టోలెడో యూనివర్సిటీ ప్రొసెసర్ స్కాట్ హాల్, ఫ్రాన్స్ ఎంబిసి అధికారి స్టాన్స్, కేంద్ర ప్రభుత్వ డ్రగ్స్ కంట్రోలర్ డాక్టర్ రాం కిషన్, హైద్రాబాద్ కేంద్రీయ విశ్వ విద్యాలయం ప్రొఫెసర్ రెడ్డన్న, ఫార్మా ఇండస్ట్రీ రంగం నిపుణులు, డాక్టర్ శశిర్ కుమార్, ప్రొఫెసర్ పన్నుర్ సెల్వం, డాక్టర్ దర్శనా జోషి, ట్రైబల్ వెల్ఫేర్ డిపార్ట్మెంట్ అధికారులు పాల్గొన్నారు. ఈ సదస్సులో వేలాది మంది ట్రైబల్ గురుకుల కళాశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్సీ స్థానాలలో బిసి లకు పెద్దపీట చారిత్రాత్మకం

## జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి ఢిల్లీ ఇన్చార్జి కర్రీ వేణు మాధవ్

**విశాఖపట్నం:**

;ఎమ్మెల్సీ స్థానాలలో బిసి లకు పెద్దపేట చారిత్రాత్మకమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి ఢిల్లీ ఇన్చార్జి కర్రీ వేణు మాధవ్ అన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఈరోజు చారిత్రాచకమైనటువంటి విషయం జరిగిందని ఇది దేశంలో అన్ని భాషల్లో కూడా ప్రచారం చేయాల్సిన అవసరం ఉందని బడుగు బలహీన వర్గాలకు ఇది నిజంగా రాజ్యాధికార పండుగ రోజని జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధికార ప్రతినిధి ఢిల్లీ ఇన్చార్జి కర్రీ వేణు మాధవ్ అన్నారు. నిజంగా దేశ చరిత్రలో ఏ ముఖ్యమంత్రి కూడా ఇంతటి సాహసమైన నిర్ణయం తీసుకోలేదని వేణుమాధవ్ అన్నారు వాస్తవానికి రాజకీయ పార్టీలన్నీ కూడా రాజ్యసభ మరియు ఎమ్మెల్సీ స్థానాలను తమ పార్టీ ఆర్థికమైన బలోపేతం కొరకు కార్పొరేట్ వారికి లేదా ఆశిస్తున్నటువంటి ఆయా వర్గాల ఉన్నత వర్గాలకి ఇచ్చే సాంప్రదాయం ఇప్పటిదాకా కొనసాగింది దానిని తిరగరాసిన చరిత్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి కి దక్కిందని కర్రి వేణుమాధవ్ అన్నారు. 18 ఎమ్మెల్సీ స్థానాల్లో 75% అంటే 11 బీసీలకు 2 ఎస్సీలకు 1 ఎస్టిలకు అవకాశం ఇవ్వడం చాలా గొప్ప విషయమని ఇది దేశంలో అన్ని రాజకీయ పార్టీలు అవలంబించే విధంగా బడుగు బలహీన వర్గాలు ప్రజాసంఘాలు ప్రచారం చేయాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఇప్పటికే జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షులు ఆర్ కృష్ణయ్య గారి ఆధ్వర్యంలో 40 సంవత్సరాల పోరాటం చేస్తుంటే బీసీలు ముఖ్యమంత్రిగా ఉన్న పార్టీలు కూడా తీసుకొని నిర్ణయాన్ని ముఖ్య మంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి తీసుకోవడం అభినందనీయమన్నారు.

# పరాగ్ డైరీని సందర్శించిన టీటీడీ

**తిరుపతి,**

దేశీయ గో జాతులను అభివృద్ధి చేసి తిరుమలలో శ్రీ వేంకటేశ్వర స్వామి ఆలయానికి రోజువారి అవసరమయ్యే పాలు, పెరుగు, నెయ్యి సొంతంగా తయారు చేసుకోవడానికి కార్యాచరణకు దిగిన టీటీడీ దేశంలోని అత్యుత్తమ దేశీయ గోశాలలు,డైరీల పనితీరును పరిశీలిస్తోంది. ఇందులోభాగంగా జేఈవో సదా భార్గవి నేతృత్వంలో చీఫ్ ఇంజినీర్ నాగేశ్వరరావు, గోశాల డైరెక్టర్ డాక్టర్ హరనాథరెడ్డి, పశువైద్య విశ్వవిద్యాలయం విస్తరణ సంచాలకులు డాక్టర్ వెంకటనాయుడు బృందంపూణె కు సమీపంలోని మంచార్ లో పర్యటించింది. ఆ గ్రామంలో ఉన్న పరాగ్ డైరీ కి చెందిన భాగ్యలక్ష్మి డైరీ ఫామ్ ను పరిశీలించారు. ఈ డైరీలోని గో జాతుల ద్వారా అత్యధిక పాల ఉత్పత్తికి అనుసరిస్తున్న విధానాలను వీరు క్షేత్ర స్థాయిలో తెలుసుకున్నారు. ఆ డైరీ యాజమాన్యం సాంకేతిక పరిజ్ఞానం ఉపయోగించి తక్కువ మంది సిబ్బందితో మంచి ఫలితాలు సాధిస్తున్న తీరును అధికారుల బృందం అధ్యయనం చేసింది. యంత్రాల సాయంతో గోవులకు ఒకే సారి 50 గోవుల నుంచి సులువుగా పాలు పితికే విధానాన్ని పరిశీలించి అక్కడి అధికారుల నుంచి వివరాలు తెలుసుకున్నారు.

# మూగజీవాల సంరక్షణకు ముందస్తు చర్యలు

## జిల్లా పశు సంవర్థక అధికారి గోపాలకృష్ణ మూర్తి

**జగిత్యాల :**

మూగజీవాల సంరక్షణ కోసం ప్రభుత్వం ముందస్తు చర్యలు చేపడుతుంది. ప్రతి ఏటా మూగజీవాలకు వ్యాధులు సోకకుండా నట్టల నివారణ మందులు పంపిణీ కార్యక్రమాన్ని పశుసంవర్ధన శాఖ ఆధ్వర్యంలో చేపడుతున్నది.. గొర్రెలు, మేకలకు సోకే వ్యాధులను నివారించేందుకు ప్రభుత్వం పశుసంవర్ధన శాఖ ఆధ్వర్యంలో జగిత్యాల జిల్లాలో ఉన్న 6.01లక్షల గొర్రెలు 0.97 లక్షల మేకలకు నట్టల నివారణ మందులు పంపిణీ కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది.. ఈ మందుల పంపిణీ జగిత్యాల జిల్లా వ్యాప్తంగా 48 టీంలను నియమించింది.. ఈటీం ప్రతిరోజూ48 గ్రామాల చొప్పున గొర్రెలు, మేకలకు నట్టల నివారణ మందులను వేయనున్నారు.. ఈ మందుల పంపిణీ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా ఈనెల 22 నుంచి ప్రారంభమై 28 వరకు నిర్వహిస్తున్నట్లు జిల్లా పశు సంవర్ధన శాఖ అధికారి గోపాల కృష్ణ మూర్తి తెలిపారు..నట్టల వ్యాప్తిమూగజీవాల్లో అంతర పరాన్న జీవులను నివారిస్తే వాటి పెరుగుదల వేగంగా సాగుతుంది.. జలగలు, బద్దె పురుగులు, నత్త గుల్లలు ముఖ్యమైనవి.. ఇవి కాలేయం, జీర్ణాశయం, చిన్న పేగు భాగాల్లో చేరి అక్కడే అంటిపెట్టుకొని రక్తాన్ని పీల్చడం వల్ల రక్తహీనతకు గురవుతాయి.. తద్వారా రోగనిరోధక శక్తి తగ్గిపోవడంతో బలహీనంగా మారి వ్యాధులకు గురవుతాయని పశు వైద్యాధికారులు సూచిస్తున్నారు... గొర్రెలు నిల్వ ఉండే నీటిని తాగటం వలన జలగలు కడుపులోకి చేరి ఆరోగ్యాన్ని దెబ్బతీస్తాయి.. బద్దె పురుగులు పచ్చిక బయళ్లతో గడ్డిని తినడం ద్వారా దానిపై ఉండేవి కడుపులోకి వెళ్లి వ్యాధులకు కారణమయ్యే అవకాశం ఉన్నందున రైతులు సరైన జాగ్రత్తలు పాటించాలని పాశుసంవర్ధన శాఖ అధికారులు తెలిపారు.. నట్టలు ఉన్న గొర్రెలు మందలో చురుగ్గా నడవలేకపోతాయి.. కండ్లు, ముక్కు నుంచి నీళ్లు కారటం ప్రారంభమవుతుంది... శరీరంపై వెంట్రుకలు నిక్కబోడుచుకొని ఉంటాయి.. మూత్రం ఎక్కువగా పోస్తుంటాయి.. సరిగ్గా మేతమేయదు.. ఆకలి మందగించడం, చురుకుగా కదలేక పోవడం వంటి లక్షణాలు ఉంటాయి..నివారణ చర్యలుఏటా నట్టాల నివారణ మందులను గొర్రెలు, మేకలకు తప్పనిసరిగా వేయించాలి.. గొర్రెలు, మేకలకు పరిశుభ్ర వాతావరణంలో ఉంచాలి.. ప్రభుత్వం ప్రతి ఏటా ఉచితంగా అందజేస్తున్న నట్టల నివారణ మందులు వేయడం ద్వారా గొర్రెలు, మేకలకు రోగ నిరోధక శక్తి పెరిగి వ్యాధులు దరికి చేరవని పశు వైద్యాధికారులు అంటున్నారు..

### పశువైద్యాధికారులకు రైతులు సహకరించాలి

గొర్రెలు, మేకలకు సోకే నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమం జిల్లా వ్యాప్తంగా ప్రతి గ్రామంలో ఈ నెల 22 నుంచి ప్రారంభం కానున్నది.. నట్టల నివారణ మందుల పంపిణీ కార్యక్రమానికి గ్రామాలకు వచ్చే అధికారులకు రైతులు కాపరులు సహకరించాలని జిల్లా పశుసంవర్ధన శాఖ అధికారి గోపాల కృష్ణ మూర్తి కోరారు.

# మెట్ట భూములను మెరుగు పరచాలి

**హైదరాబాద్**




మెట్ట భూములు ఉష్ణ, సమశీతోష్ణ మండలాలలో ఎక్కువగా విస్తరించి ఉన్నాయి. మారుతున్న వాతారవరణ పరిస్థితుల నేపథ్యంలో ప్రస్తుతం ఆహార భద్రత, జీవవైవిధ్యం, సన్న, చిన్నకారు రైతుల అవసరాలను దృష్టిలో పెట్టుకుంటే మెట్టభూముల పరిస్థితి ఆందోళనకరంగా ఉన్నదని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి అన్నారు. మెట్టభూముల మెరుగు పరిచే అంశంపై ఇక్రిషాట్ లో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ముఖ్య అతిథిగా అయన పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో నీతి అయోగ్ సభ్యులు రమేష్ చంద్, ఇక్రిషాట్ డీజీ డాక్టర్ జాక్వెలిన్ హ్యూగ్స్, ఇక్రిషాట్ డీడీజీ డాక్టర్ అరవింద్ కుమార్ మరియు వివిధ జాతీయ, అంతర్జాతీయ సంస్థలు శాస్త్రవేత్తలు పాల్గోన్నారు. మంత్రి మాట్లాడుతూ ఈ పరిస్థితులలో శాస్త్రవేత్తలు, పరిశోధకులు మెట్టభూముల పరిస్థితిని మెరుగుపరిచి సుస్థిర వ్యవసాయానికి దారులు వేయాలి. అందులో భాగంగా జరిగే పరిశోధన ఫలితాలు దీర్ఘకాలం పాటు వాతావరణ పరిస్థితులను మారుస్తూ జీవవైవిధ్యాన్ని కాపాడుతూ సహజ వనరులను సంరక్షించాలి. పర్యావరణ పరిరక్షణకు, పోషక భద్రతకు, పేదల ఆకలి తీర్చడానికి మెట్టభూములపై పరిశోధనలు చేస్తున్న ఇక్రిషాట్ సేవలు అభినందనీయం. గత 50 ఏళ్లుగా ఇక్రిషాట్ సేవలు ఆసియా, ఆఫ్రికా ఖండాలలో ఎందరికో మేలు చేయడం గర్వకారణం. రాబోయే కాలంలో మెట్టభూములు మెరుగు పరిచేందుకు నూతన సాంకేతికతను సృష్టించేందుకు ఈ సదస్సు తోడ్పడుతుందని ఆశిస్తున్నానని అన్నారు.తెలంగాణలో మెట్ట భూములు మెరుగు పరిచే అంశం మీద సదస్సు నిర్వహించడం అభినందనీయం. ఈ సదస్సులో వచ్చే ఫలితాలు జీవ వైవిధ్యానికి ఉన్న ముప్పును, తగ్గుతున్న నేల ఆరోగ్యం, మారుతున్న వాతావరణ పరిస్థితులు, కుచించుకు పోతున్న వ్యవసాయ ఉత్పాదతకు సరైన సమాధానాలు రాబడతాయని భావిస్తున్నాను. పరిశోధనలన్నీ నేలలో ఉండే కర్బన శాతాన్ని, నేల జీవ వైవిధ్యాన్ని మెరుగు పరుస్తాయని నమ్ముతున్నాను. జాతీయ, అంతర్జాతీయ సంస్థలు, వ్యవసాయ విశ్వవిద్యాలయాలు కలిసి పరస్పర సహకారంతో ఈ దిశగా పనిచేయాల్సిన అవసరం ఉంది. మెట్ట భూముల సమస్యలపై ప్రాంతాల వారీగా నిర్దిష్ట పరిశోధనా ఫలితాలను విడుదల చేయాలని అన్నారు

# 48 గంటలపాటు పనిచేయడానికి కూడా సిద్ధంగా ఉన్నా

## తనలాంటి ప్రతిభావంతులను తమిళ ప్రజలు గుర్తించడం లేదు

## తెలంగాణ, పుదుచ్చేరి రాష్ట్రాల గవర్నర్ డాక్టర్ తమిళిసైసౌందరరాజన్ ఆవేదన



**చెన్నై :**

తనలాంటి ప్రతిభావంతులను తమిళ ప్రజలు గుర్తించడం లేదని తెలంగాణ, పుదుచ్చేరి రాష్ట్రాల గవర్నర్ డాక్టర్ తమిళిసైసౌందరరాజన్ ఆవేదన వ్యక్తం చేశారు. కోయంబత్తూరులోని పీళమేడు ప్రాంతంలో ప్రైవేటు కళాశాల ప్రాంగణంలో ఏర్పాటైన సభలో ఆమె ప్రసంగిస్తూ.. తన లాంటి ప్రతిభావంతులకు తమిళనాట గుర్తించకపోయినా కేంద్రప్రభుత్వం తమ సత్తాను తెలుసుకుని గవర్నర్(పదవినిచ్చిందని వ్యాఖ్యానించారు. తనలాంటి వ్యక్తుల ప్రతిభాపాటవాలు వృథా కాకూడదనే తలంపుతోనే కేంద్రప్రభుత్వం తమను గుర్తించి పదవులలో కూర్చోబెడుతోందన్నారు. తనలాంటి వ్యక్తుల ప్రతిభను తమిళ ప్రజలు గుర్తించి ఉంటే ఈపాటికి ఎంపీలుగా గెలిచి కేంద్రమంత్రులుగా ఉండేవాళ్ళమని, పార్లమెంట్లో ప్రజా సమస్యలపై పోరాడి ఉండేవాళ్ళమని చెప్పారు. ఈ కార్యక్రమానికి రెండు సెల్ఫోన్లు చేతపట్టుకుని నడిచి వస్తుండగా ఓ పెద్దాయన రెండు సెల్ఫోన్లు ఎలా వాడుతున్నారని ప్రశ్నించారని, అందుకు తాను బదులిస్తూ రెండు రాష్ట్రాల పాలనా వ్యవహారాలను చూస్తున్న తనకు అదో లెక్కా అని చెప్పానని తమిళిసై అన్నారు. తాను 48 గంటలపాటు పనిచేయడానికి కూడా సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ప్రజల కోసం కష్టపడి సేవలందిస్తుంటే అవేవీ వార్తలుగా రావడం లేదని, అయితే ఆదివారం మహాబలిపురంకార్యక్రమంలో జారిపడితే వెంటనే ఆ ఘటన పెద్ద వార్తగా మారిందని తమిళిసై విమర్శించారు.

# భార్య ప్రియుడ్ని అడ్డంగా బుక్ చేసిన భర్త



**వరంగల్ :**

విద్యాబుద్ధులు నేర్పే గురువులే దారి తప్పారు. వివాహేతర సంబంధం నెరుపుతుండగా ఇద్దరు టీచర్లు రెడ్ హ్యాండెడ్ గా పట్టుబడ్డారు. వివరాల్లోకి వెళ్తే ములుగు జిల్లా మంగపేట మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్ లో ఫిజికల్ సైన్స్, బయోసైన్స్ స్కూల్ అసిస్టెంట్లుగా పని చేస్తున్న కుక్కల నాగేందర్, మరో టీచర్ కొంత కాలంగా వివాహేతర సంబంధం కొనసాగిస్తున్నారు. సదరు ఉపాధ్యాయురాలి భర్త మహబూబాబాద్ జిల్లా కేంద్రంలో ఏఆర్ కానిస్టేబుల్ గా పని చేస్తున్నారు. అయితే వారి వివాహేతర సంబంధం గురించి తెలుసుకున్న కానిస్టేబుల్ ఈ తతంగంపై గతంలోనే ప్రిన్సిపాల్ కు ఫిర్యాదు చేశారు. దీంతో సదరు ఉపాధ్యాయురాలిని జనవరిలో మంగపేట నుంచి కొత్త బెస్తగూడెం పాఠశాలకు డిప్యూటేషన్ పై పంపారు. అయినా తీరు మార్చుకోలేదు. ఇద్దరు వివాహేతర సంబంధం కొనసాగించారు. ఈ క్రమంలో ఉపాధ్యాయురాలి భర్త ఫిబ్రవరి 18వ తేదీన శివరాత్రి రోజు వేములవాడకు బందోబస్తు కోసం వెళ్లి వచ్చారు.ఆయనకు సోమవారం సెలవు దినం కావడంతో భార్య, కూతురిని చూసేందుకు మంగపేటకు వచ్చారు. ఈ క్రమంలోనే నాగేందర్ సదరు ఉపాధ్యాయురాలి సెల్ కు ఫోన్ చేయగా.. కానిస్టేబుల్ లిఫ్ట్ చేశారు. అయితే హాలో అనకముందే.. 'తాను వస్తున్నానని .. తలుపు తీసి ఉంచాలి' అని చెప్పారు. దీంతో అప్రమత్తమైన కానిస్టేబుల్ భార్యకు విషయం చెప్పకుండా చివరి గదిని లాక్ చేసి.. ముందు తలుపులు తీసి ఉంచి బాత్రూమ్ లో దాక్కున్నాడు. ఉపాధ్యాయుడు రాత్రి ఇంటికి వచ్చి ఉపాధ్యాయుడు లోపలికి వెళ్లగానే బయటి నుంచి తాళం వేశారు. అనంతరం కొత్తగూడ మండలంలోని బంధువులకు, ఉపాధ్యాయులకు సమాచారం ఇచ్చారు. అనంతరం నాగేందర్, టీచర్ కు దేహశుద్ధి చేసి మండల కేంద్రంలో ఊరేగింపుగా తీసుకెళ్లి పోలీసులకు అప్పగించారు. ఈ మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# వైసీపీ శ్రేణులు దాడులు చేస్తుంటే పోలీసులు మౌనంగా చూస్తున్నారు

## గన్నవరంలో టిడిపిపార్టీ శ్రేణులపై హింసాత్మక ఘటనలపై డీజీపీ కి చంద్రబాబు లేఖ

**అమరావతి :**



గన్నవరంలో తెలుగుదేశం పార్టీ శ్రేణులపై దాడులు, హింసాత్మక ఘటనలపై టీడీపీ జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు డీజీపీ కి లేఖ రాశారు. ఈ సందర్భంగా ఆయన ఇక్కడ మీడియాతో మాట్లాడుతూ టీడీపీ నేతలు దొంతు చిన్నా పట్టాభి భద్రతకు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. వైసీపీ గూండాలకు పోలీసులు పూర్తి స్వేచ్ఛ ఇచ్చినట్లు ఉందని, వైసీపీ శ్రేణులు దాడులు చేస్తుంటే పోలీసులు మౌనంగా చూస్తున్నారని మండిపడ్డారు. గన్నవరంలోని టీడీపీ ఆఫీస్ పై వైసీపీ రౌడీలు దాడి చేసి ధ్వంసం చేశారని, అక్కడ ఉన్న పలు వాహనాలకు నిప్పు పెట్టారన్నారు. దొంతు చిన్నాకు చెందిన పలు వాహనాలకు నిప్పు పెట్టారని, పట్టాభిని కొందరు వ్యక్తులు కిడ్నాప్ చేశారని ఆరోపించారు. పట్టాభిని పోలీసులు అరెస్ట్ చేశారా?.. లేక ఎవరైనా కిడ్నాప్ చేశారా?... నిందితులను అరెస్ట్ చేసి కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేసినట్లు ఆ లేఖలో పేర్కొన్నట్లు చంద్రబాబు తెలిపారు.కాగా గన్నవరంలో ఉద్రిక్తత కొనసాగుతోంది. దీంతో పోలీసులు 144 సెక్షన్ విధిస్తూ.. పోలీస్ యాక్ట్ 30 అమలు చేస్తున్నారు. గన్నవరంలో దాడుల నేపథ్యంలో పోలీసులు ఈ చర్యలు చేపట్టారు. టీడీపీ, వైసీపీ కార్యాలయాల దగ్గర పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.గన్నవరంలో వైసీపీ శ్రేణులు రెచ్చిపోయాయి. విధ్వంసం సృష్టించాయి. గన్నవరం టీడీపీ కార్యాలయం పై వైసీపీ గుండాలు దాడి చేశారు. కార్యాలయంలోని కంప్యూటర్లు, ఫర్నీచర్ ధ్వంసం చేశారు. అంతటితో ఆగకుండా ఆఫీస్ ఆవరణలో ఉన్న వాహనాలపై పెట్రోల్ పోసి నిప్పుపెట్టారు. కత్తులతో టీడీపీ ఫ్లెక్సీలను వైసీపీ కార్యకర్తలు చించివేశారు. ఓ కారు అద్దాలను ఇటుకలతో బద్దలు కొట్టారు. పార్టీలో కార్యాలయంలో కలియతిరుగుతూ విధ్వంసం సృష్టించారు. ఈ దాడి గన్నవరం ఎమ్మెల్యే వల్లభనేని వంశీ అనుచరులే చేశారని టీడీపీ నేతలు చెబుతున్నారు. పోలీసులు ఉండగానే చూస్తుండగానే వైసీపీ కార్యకర్తలు దాడికి పాల్పడ్డారని చెబుతున్నారు. ఈ విషయంపై పోలీసులను అడిగితే సమాధానం చెప్పేందుకు నిరాకరించడం గమనార్హం. టీడీపీ నేతలు పోలీస్స్టేషన్లో ఫిర్యాదు చేసిన వెంటనే పోలీసులు స్పందించి ఉంటే ఇంత ఘోరం జరిగేది కాదని టీడీపీ నేతలు అంటున్నారు. పోలీసులు అలసత్వమే కారణమని వారు ఆరోపిస్తున్నారు.ఎమ్మెల్యే వంశీపై అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ గన్నవరం టీడీపీ ఆఫీసుపై దాడికి దిగినట్లు తెలుస్తోంది. దాడిలో 50-60 మంది అల్లరి మూకలు పాల్గొన్నారు. పోలీసుల సాక్షిగా వంశీ అనుచరుల విధ్వంసకాండకు దిగారని టీడీపీ నేతలు చెబుతున్నారు. మొదట టీడీపీ ఆఫీస్ దగ్గర ఎమ్మెల్యే వంశీ రెక్కీ నిర్వహించారని చెబుతున్నారు. వంశీపై ఫిర్యాదు చేయడానికి టీడీపీ నేతలు పోలీస్ స్టేషన్కు వెళ్లారు. టీడీపీ నేతలు వెళ్లిన వెంటనే కార్యాలయంపై వంశీ అనుచరుల దాడికి దాగారని చెబుతున్నారు. టీడీపీ కార్యాలయంలో ఎవరూ లేని సమయంలో వైసీపీ గూండాల దాడికి దిగారని టీడీపీ నేతలు అంటున్నారు.

ప్రజాతపన
prajathapana.com

# బలగం' సినిమాలో పాత్రలను ప్రేక్షకులకు పరిచయం చేసిన దిల్ రాజు, దర్శకుడు వేణు ఎల్దండి

దిల్‌రాజు ప్రొడక్షన్స్ శిరీష్ సమర్పణలో హర్షిత్ రెడ్డి, హన్షిత నిర్మిస్తోన్న సినిమా 'బలగం'. ప్రియదర్శి, కావ్యా కళ్యాణ్ రామ్, సుధాకర్ రెడ్డి, మురళీధర్ గౌడ్ తదితరులు ప్రధాన తారాగణంగా నటిస్తున్నారు. వేణు ఎల్దండి దర్శకత్వం వహించారు. ఈ సినిమా ప్రమోషనల్ యాక్టివిటీస్ జోరుగా ఉన్నాయి. త్వరలోనే 'బలగం' సినిమాను రిలీజ్ చేయటానికి నిర్మాత దిల్ రాజు ప్లాన్ చేస్తున్నారు. సోమవారం హైదరాబాద్‌లో జరిగిన పాత్రికేయుల సమావేశంలో సినిమాలోని పాత్రలను పరిచయం చేశారు. ఈ సందర్భంగా జరిగిన పాత్రికేయుల సమావేశంలో.. స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు మాట్లాడుతూ "'బలగం' సినిమా షూటింగ్ పూర్తయ్యింది. త్వరలోనే రిలీజ్ డేట్ అనౌన్స్ చేస్తాం. ఇప్పటికే విడుదలైన ఊరు పల్లెటూరు సాంగ్ పొట్టి పిల్ల సాంగ్‌లకు సూపర్బ్ రెస్పాన్స్ వస్తున్నాయి. సినిమా ఆర్గానిక్‌గా ఆడియెన్స్‌లోకి వెళ్లిపోయింది. వేణు తన ఐడియాను ప్రాపర్‌గా మ్యూజిక్ డైరెక్టర్ భీమ్స్‌కి చెప్పటం, అలాగే దానికి అద్భుతమైన లిరిక్స్‌ని కాసర్ల శ్యామ్ అందించారు. మంచి సోల్ ఉన్న సాంగ్స్‌ను అందించారు. సినిమాకు పనిచేసిన ప్రతీ ఒక్కరూ ప్రాణం పెట్టి పని చేశారు. మరో రెండు సాంగ్స్‌ను త్వరలోనే రిలీజ్ చేస్తాం. ఆ పాటలు వింటే హృదయాలు కదిలిపోతాయి. అంత గొప్పగా ఉంటాయి పాటలు.

ఇప్పుడే ఇంత రెస్పాన్స్ వస్తుంటే రిలీజ్ తర్వాత ఇంకా హిట్ అవుతుందని భావిస్తున్నాం. ఇక 'బలగం' సినిమా గురించి చెప్పాలంటే వేణు ముందుగానే ఇందులో క్యారెక్టర్స్ ఎలా ఉండాలి. అందులో ఎవరు యాక్ట్ చేయాలనేది ప్లాన్ చేసుకుని వచ్చి నా దగ్గర అప్రూవల్ తీసుకుంటూ వచ్చాడు. ముగ్గురు, నలుగురు తప్పితే దాదాపు కొత్త వారినే వేణు యాక్టర్స్‌గా ఎంపిక చేసుకున్నాడు. దిల్ రాజు ప్రొడక్షన్స్ అనే ఐడియా వచ్చినప్పుడు దీని ద్వారా వీలైనంత మంది కొత్త ఆర్టిస్టులను, టెక్నీషియన్స్‌ను పరిచయం చేయాలనేదే మా ఆలోచన. అందులో భాగంగా ముందు వేణు దర్శకుడిగా పరిచయం అయ్యాడు. డీజే టిల్లుతో ఫేమస్ అయిన మురళీధర్‌గారు ఇందులో హీరోయిన్ తండ్రి పాత్రలో నటించారు. ఆయన పాత్ర అందరికీ గుర్తుండిపోతుంది. తర్వాత హీరో మేనత్త పాత్రలో విజయలక్ష్మిగారు ఎక్సలెంట్‌గా నటించారు. ఆమె పాత్రను చూడగానే మనకు మన మేనత్తలు గుర్తుకు వస్తారు. అలాగే ఐలయ్యగారు వన్ ఆఫ్ ది బెస్ట్ క్యారెక్టర్‌గా మనకు గుర్తుండిపోతుంది. హీరో తండ్రిగా ఐలయ్య జీవించారు.

ఇక హీరో దర్శి గురించి చెప్పాలంటే సెల్ఫిష్ క్యారెక్టర్‌ను తను క్యారీ చేసిన తీరు గురించి ఎంత చెప్పినా తక్కువే. ఇక హీరోయిన్ కావ్య గంగోత్రి సినిమాలో చైల్డ్ ఆర్టిస్ట్‌గా నటించింది. మా సినిమాతో ఇండస్ట్రీలోకి అడుగు పెట్టినప్పటికీ మసూదతో ముందుగానే మీ అందరికీ పరిచయం అయ్యింది. దర్శి, కావ్య.. ఎమోషన్స్‌ను చాలా చక్కగా క్యారీ చేశారు. వేణు ఇంత మందిని ఎంతో గొప్పగా రాసుకున్నారు. తెలంగాణకి చెందిన పల్లెటూర్లో జరిగే కథ కావటంలో తెలంగాణ కల్చర్ తెలిసిన చాలా మంది ఈ సినిమాను చూశారు. సినిమా చాలా చాలా బాగుందని అందరూ అభినందించారు. కుటుంబంలోని బంధాలు, అనుబంధాలు గుర్తుకు వస్తాయి.అలాగే రవి, కృష్ణతేజ మనల్ని వారి నటనతో ఆకట్టుకుంటారు" అన్నారు.



దర్శకుడు వేణు ఎల్దండి మాట్లాడుతూ "దర్శకుడిగా అవకాశం ఇచ్చిన దిల్ రాజుగారికి థాంక్స్. త్వరలోనే 'బలగం' సినిమాను మీ ముందుకు తీసుకువస్తున్నాం. ఈ సినిమాలో నారాయణ పాత్రలో మురళీధర్, హీరో మేనత్త పాత్రలో విజయ లక్ష్మి, హీరో తల్లి పాత్రలో స్వరూప, హీరో బాబాయ్ పాత్రలో మొగిలి ఇలా అందరూ దాదాపు కొత్త వారినే పరిచయం చేశాం. ఇక ఇప్పటికే మా 'బలగం' మూవీ నుంచి విడుదలైన రెండు సాంగ్స్‌కు భీమ్స్‌గారు ఇచ్చిన సాంగ్స్, దానికి కాసర్ల శ్యామ్ రాసిన లిరిక్స్ ఎక్సలెంట్. పాటలన్నీ శ్యామ్‌గారే రాశారు. ఆయన గురించి ఎంత చెప్పినా తక్కువే. ఈ జర్నీలో సపోర్ట్ చేసిన అందరికీ థాంక్స్" అన్నారు.

# 'రిచి గాడి పెళ్లి" ట్రైలర్ లాంచ్



కె.ఎస్.ఫిల్మ్ వర్క్స్ బ్యానర్ పై తెరకెక్కుతున్న చిత్రం "రిచి గాడి పెళ్లి" పేరుతో రూపొందుతున్న ఈ చిత్రం ఇటీవలే షూటింగ్ పూర్తి చేసుకుని విడుదలకు సిద్ధంగా ఉంది. నవీన్ నేని, ప్రణీత పట్నాయక్ ప్రధాన తారాగణంగా కెఎస్ హేమరాజ్ ఈ చిత్రానికి దర్శకత్వం వహించారు. తాజాగా ఈ సినిమా ట్రైలర్ ను హరీష్ శంకర్ లాంచ్ చేసారు,. రిలీజ్ చేసిన ఈ ట్రైలర్ చూస్తుంటే చిన్నప్పుడు బల్లల మీద ఆడుకున్న చిన్న చిన్న ఆటలను ఆధారం చేసుకుని తీసిన సినిమా ఇది అని అర్ధమవుతుంది. ఆ చిన్న ఆట వల్ల వాళ్ళ జీవితాలు ఎలా మలుపులు తిరిగాయనేదే ఈ సినిమా కథాంశం.

దర్శకుడు కె యస్ హేమరాజ్ "రిచి గాడి పెళ్లి" అనేది మానవ సంబంధాలకు అద్దంపట్టే కథ. ప్రతి పాత్రలో వేరియేషన్ ఉండేలా డిజైన్ చేశాం. అని ఇదివరకే చెప్పుకొచ్చారు. ఆ మాదిరిగానే ట్రైలర్ ను డిజైన్ చేసారు చిత్ర బృందం. ఈ ట్రైలర్ కి మంచి స్పందన లభిస్తుంది. త్వరలో ఈ సినిమా రిలీజ్ కి సిద్దమవుతుంది.










Printed, Published & Owned by K.Umadevi And Printed at Varadhi Publications,D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh.Published at D.No:5-1-24/66 Lakshmipuram, Hindupur-515201,Sri Satya Sai District, Andhrapradesh. EDITOR :K.Umadevi ,
e mail ID : b.nagaseshu47@gmail.com cell No:9985509053 RNI/APTEL/2021/80950